Follow: @ANNTELUGU
30-05-2026
ANN తెలుగు
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 152 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ‘మహా’ఎఫెక్ట్

- కొండాపూర్ సర్వే నెంబర్ 59 గల్లంతుపై మహా కథనానికి.. మహా స్పందన..
- ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న ఏడంతస్తుల భవనం స్వాధీనం
- తేలుకుట్టిన దొంగల్లా కబ్జా దారులు
- మహా పత్రికకు జే జేలు పలికిన స్థానికులు
- ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు : తహసీల్దార్ మహిపాల్ రెడ్డి

02

టాప్ న్యూస్

## రాజ్యసభకు షర్మిల? రాహుల్ గాంధీతో భేటీ



- రాహుల్ గాంధీతో ఏపీ కాంగ్రెస్ చీఫ్ భేటీ
- కర్ణాటక రాజ్యసభ ఎన్నికల వేళ కీలక చర్చలు
- ఏపీ గొంతును రాజ్యసభలో వినిపించే అవకాశం కోరిన షర్మిల

02


## పవన్ ఒక ప్యాకేజ్ స్టార్



- జగన్ ఎక్కువ ఇస్తే అటు వెళతారు
- కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి
- ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టొద్దని వ్యాఖ్యలు
- ‘గో బ్యాక్ ఆంధ్ర’ వ్యాఖ్యలతో రాజకీయ దుమారం


02

## తెలంగాణలో ఉండాలంటే వీసా కావాలా?



- ఏపీ బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి హాట్ కామెంట్స్
- ఎమ్మెల్యే సామేల్‌పై కేసు పెట్టాలని డిమాండ్
- ఐదు కోట్ల మంది ఆంధ్రులను అవమానించారన్న విష్ణువర్ధన్ రెడ్డి

02



## విద్యార్థినులకు పీరియడ్స్ సెలవులు

- అసంఘటిత రంగ మహిళలకు ప్రసూతి లీవ్స్.
- కేరళ నూతన ప్రభుత్వ విధానాలు ప్రకటించిన గవర్నర్.
- ఏటా రూ.25 లక్షల ఆరోగ్య బీమా

02



## రూ.1500కోట్ల విలువైన భూ కబ్జాకు యత్నం

02

- ముగ్గురిని అరెస్టు చేసినట్లు వెల్లడించిన డీసీపీ
- వైసీపీ మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానాయుడు, బొల్లా రమేశ్ పరారీలో ఉన్నట్లు వెల్లడి
- గండిపేట తహసీల్దారు ఫిర్యాదుతో విషయం వెలుగు చూసిందన్న డీసీపీ






## త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు

- ముద్రణ ఖర్చుల నియంత్రణకు ఆర్బీఐ కసరత్తు
- త్వరలోనే పైలట్ ప్రాజెక్ట్.

02



## అక్రమ ఇసుక తవ్వకాలపై ఈడీ కొరడా

- రూ.2,407 కోట్ల కుంభకోణం వెలుగులోకి.
- భారీగా నగదు, వెండి పట్టివేత.
- ముమ్మరంగా కొనసాగుతున్న దర్యాప్తు.

02

# ఎస్ఐఆర్‌పై.. అలసత్వం వద్దు







### కొందరు ఎమ్మెల్యేలు జమీందార్లుగా వ్యవహరిస్తున్నారు

- కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్ క్లాస్
- పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాల్సిందే
- సోషల్ మీడియాపై ఎమ్మెల్యేలు శిక్షణ పొందాలి
- పార్లమెంట్ , అసెంబ్లీ, డివిజన్ల వారీగా కమిటీలు వేయాలని సూచన
- ప్రతి పదిరోజులకోసారి ఫీల్డ్ కు వెళ్ళి కార్యకర్తలను కలుస్తా.. ఇన్ ఛార్జి మంత్రులు కూడా చేయాలి
- కాంగ్రెస్ అనుకూల ఓట్లను తొలగించేందుకే ఈసీ కుట్ర - పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

**హైదరాబాద్, మహా**
ఎస్ఐఆర్ ప్రక్రియలో పార్టీ నేతలు అలసత్వం ప్రదర్శించవద్దని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. . ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో పర్ఫామెన్స్ సరిగ్గాలేని నేతలను ఎందుకు వెనుకబడ్డారో క్లారిటీ ఇవ్వాలని ఆదేశించారు. గాంధీ భవన్‌లో పీఏసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశం పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరగ్గా సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాప్రతినిధులు, మంత్రుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్టీ కోసం కష్టపడే విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేస్తూనే, క్షేత్రస్థాయిలో కొంతమంది ఎమ్మెల్యేల ప్రవర్తనపై సంచలన వ్యాఖ్యలు చేశారు

మిగితా 2వ పేజీలో


## ఒక్క ఓటు కూడా డిలిట్ కావొద్దు

- దళితులు, మహిళలు, మైనారిటీల ఓట్లు తొలగించే ప్రమాదం
- రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు హైదరాబాద్ బాధ్యతలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు

**హైదరాబాద్, మహా** : రాబోయే రోజుల్లో పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై క్షేత్రస్థాయి వ్యూహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖరారు చేశారు. ముఖ్యంగా ‘ఎస్ఐఆర్’ ప్రక్రియపై నాయకులు, కార్యకర్తలు పూర్తి అవగాహన పెంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. దీనివల్ల సామాన్యులు, పేదలు, కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాబోతున్నాయో నాయకులు ముందుగానే గుర్తించడం మంచి పరిణామమని సీఎం పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అనేది లంబాడీలు, ఆదివాసీలు, దళితులు, మైనార్టీలు , వలస కార్మికులకు పెద్ద సమస్యగా మారే ప్రమాదం ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని నియోజకవర్గాల్లో చాలా మంది ఉపాధి కోసం వలసలు పోయారని, అలాగే మహిళలకు కూడా దీనివల్ల ఇబ్బందులు ఎదురవుతాయన్నారు.

మిగితా 3వ పేజీలో

## మైల్ స్టోన్ నిర్మాణ సంస్థకు షాక్



GOVERNMENT OF TELANGANA IRRIGATION
&CAD DEPARTMENT

From
Sri.A.Jayapal Kumar, B.Tech.,
Deputy Executive Engineer,
Mandal, Irrigation Sub Division No.3,

To,
M/s Milestone Developers ,
Athvelly (V) Medchal (M)
Medchal (Malkajgiri) Dist.

Letter. No. DEE/Irrig Sub Divi No.3/Medchal/2026/ 102 Dt:27.05.2026

Sub:- I&CADD- Athvelly Village -Adverse news published in Maha Patrika - Milestone Developers - Calling for submission of permissions/NOCs and stoppage of works - Reg.

Ref:
1. Adverse news article in Maha Patrika Dt:22.05.2026
2. Adverse news article in Maha Patrika Dt:28.05.2026

-------- 0 --------

With reference to the adverse news articles cited above, it is observed from the news articles repeatedly published in Maha News that certain development/layout activities are carried out on the Surplus course of Athvelly Pedda Cheruvu on the downstream side of the bridge near Athvelly Village, Medchal Mandal , Medchal - Malkajgiri District

In this regard, you are hereby requested to furnish the following documents to this office for examination and verification:

1. Copy of layout approval issued by Hyderabad Metropolitan Development Authority
2. Copies of No Objection Certificates (NOCs) obtained from the Revenue and Irrigation Department.

As there is an allegation regarding encroachment of Nala by ur firm, it is hereby instructed to stop all ongoing development activities in the layout so as to avoid any violation of the provisions of the Telangana Irrigation Act, 1357 Fasli,

Hence, you are requested to submit the above documents immediately to this office at the earliest.

Encls: -As Above

Yours faithfully,

Deputy Executive Engineer I&CADD,
Irrigation Sub Division No.3 Medchal..

### మహా కథనాల ఎఫెక్ట్

- అత్వెల్లిలో అక్రమాలపై నోటీసులు జారీచేసిన ఇరిగేషన్ అధికారులు
- రాష్ట్రవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిన కథనాలు
- ఎన్వోసీలు, అనుమతి పత్రాలు సమర్పించాలని ఆదేశం
- నాలాల ఆక్రమణలపై రైతుల్లో ఆందోళన
- నోటీసులతో సరిపెడతారా..? చర్యలు తీసుకుంటారా..?

02

**హైదరాబాద్ మహా స్పెషల్ టాస్క్ ఫోర్స్ :**
మైల్ స్టోన్ నిర్మాణసంస్థ బరితెగింపుపై మహా పత్రిక ప్రచురించిన కథనాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించాయి. అత్వెల్లి పెద్ద చెరువు అలుగు, నాలాలను ఆక్రమించి లే అవుట్ నిర్మాణం సాగిస్తున్న నేపథ్యంలో మహా పత్రిక వరుస కథనాలు ప్రచురించగా, ప్రభుత్వవర్గాల్లో ఇవి కదలిక తెచ్చాయి .కథనాలకు స్పందించిన ఇరిగేషన్ అధికారులు గతంలో జారీ చేసిన ఇరిగేషన్ ఎన్వోసీలు ఇరిగేషన్ కార్యాలయానికి వచ్చి అందజేయాలని మౌఖిక ఆదేశాలు జారీ చేసినప్పటికి మైల్ స్టోన్ యాజమాన్యం స్పందించక పోవటంతో ఇరిగేషన్ ఎన్వోసీ,హెచ్ ఎం డీ ఏ ఇచ్చిన లే అవుట్ అనుమతుల పత్రాలు అందజేయాలనీ శుక్రవారం నోటీసులు జారీ చేసారు. హెచ్ ఎం డీ ఏ ఇచ్చిన లే అవుట్ పర్మిట్ (ఎల్. పీ )నెంబర్ కోసం సదరు మైల్ స్టోన్ యాజమాన్యానికి హెచ్ఎండీఏ అధికారులు సైతం మెస్సేజ్ లు, ఫోన్లు చేసినప్పటికి వారు స్పందించటం లేదని తెలిపారు. మైల్ స్టోన్ అక్రమాలు, బరితెగింపుపై రైతులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైల్ స్టోన్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, నాలాల ఆక్రమణలు తొలగించడంతో పాటు భారీ జరిమానా విధించాలని స్థానిక రైతులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు నోటీసులతో సరిపెడతారా? చర్యలు తీసుకుంటారా? ఏం జరుగుతుందో చూడాల్సి ఉంది.





## రైతుల డిస్కమ్ పెద్ద కుట్ర

- ఈఆర్సీ ప్రజాభిప్రాయసేకరణలో టీఆర్ఎస్ చీఫ్ కవిత
- 33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్ చేయాలి
- రైతుల మోటార్లకు మీటర్లు పెట్టే ప్రయత్నం చేయవద్దు



**హైదరాబాద్, మహా :** తెలంగాణలో రైతు డిస్కమ్ పేరుతో రైతులపై రేవంత్ సర్కార్ కుట్ర చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. రైతు డిస్కమ్ ఏర్పాటుపై శుక్రవారం తెలంగాణ ఈఆర్సీ నిర్వహించిన ప్రజా అభిప్రాయ సేకరణ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రైతు డిస్కమ్ తో వ్యవసాయానికి ఎండ్రిన్ పోసినట్లు అవుతుందని.. రైతులకు అన్యాయం చేస్తూ 1999 నాటి కాల్పుల ఘటనను ప్రభుత్వం కొని తెచ్చుకోవద్దని సూచించారు. ఈ నిర్ణయం నిజంగా రైతులకు మంచి చేసేదే అయితే ఎందుకు సీక్రెట్ గా ఉంచారని ప్రశ్నించారు. డిస్కమ్ లకు వేల కోట్ల రూపాయలు బకాయిలు పెట్టి ద్రోహం చేసింది ప్రభుత్వమేనని విమర్శించారు. రాష్ట్ర రైతాంగం భవిష్యత్ ను ఆగం చేసే ఈ ప్రతిపాదనను ఈఆర్సీ రిజెక్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రైతు డిస్కమ్ అనేది సంపూర్ణంగా తెలంగాణ భవిష్యత్ ను నిర్ణయించే సబ్జెక్ట్ అని.. కనుక రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఈ పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో రైతులు ఎంతో కష్టపడి 29 లక్షల బోర్లు వేసుకున్నారని.. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక విద్యుత్ రంగంలో రూ. లక్ష కోట్లు పెట్టుబడి పెట్టి మంచి మార్పులు తెచ్చారని గుర్తుచేశారు. కాళేశ్వరం, పాలమూరురంగారెడ్డి నుంచి ఒక్క ఎకరానికి నీళ్లు రాకపోయినా సరే బోర్ల ద్వారా నీళ్లు వచ్చాయని చెప్పారు. 20 లక్షల టన్నులు ధాన్యం పండించే తెలంగాణ రైతులు ఇప్పుడు కోటి 40 లక్షల టన్నుల ధాన్యం పండిస్తున్నారని అన్నారు. కానీ రైతు డిస్కమ్ కారణంగా మొత్తం 29 లక్షల బోర్ల మోటార్ల పరిస్థితి డోలాయమానంలో పడుతుందని చెప్పారు. రైతు డిస్కమ్ పేరుతో ఈ ప్రభుత్వం రైతులను

మిగితా 2వపేజీలో

## దేశానికి రుతుపవనాల షాక్

- ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం.
- నైరుతిపై ఐఎండీ కీలక అంచనా.. ఎల్ నినో ప్రభావమే కారణం.
- జూన్‌లో ఏపీ సహా పలు రాష్ట్రాల్లో పెరగనున్న వడగాడ్పుల తీవ్రత.

02





# 'మహా' ఎఫెక్ట్

**హైదరాబాద్, మహా స్పెషల్ టాస్క్ ఫోర్స్ :** భూ కబ్జాదారులపై రెవెన్యూ అధికారులు ఉక్కు పాదం మోపారు.. శేలింగం పల్లి మండలం మాదాపూర్ సర్కిల్ కొండాపూర్ లో ప్రభుత్వ సర్వే నెంబర్ 59 గల్లంతు పై మహా పత్రిక ఈ నెల 11న పూర్తి ఆధారాలతో వరుస కథనాలను ప్రచురించింది. వెంటనే స్పందించిన రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టారు. ఆ విచారణలో విస్తూ పోయె విషయాలు వెలుగులోకి వచ్చినట్లు వారు తెలిపారు.. నకిలీ పత్రాలు సృష్టించి సర్వే నెంబర్ 60 లో నిర్మాణాలు చేస్తున్నట్లు జి హెచ్ ఎం సీ నుండి అనుమతులు పొంది పక్కనే ఉన్న ప్రభుత్వ సర్వే నెంబర్ 59 లో నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు..సర్వేయర్ తో సర్వే చేయించటం ద్వారా నిర్మిస్తున్న భవనం సర్వే నెంబర్ 59 లో వస్తుందని నిర్ధారణ కావటంతో పంచనామా చేసి భూమితో పాటు భవనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు.. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు పెడతామని ఆయన హెచ్చరించారు. కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడిన మహా పత్రికకు స్థానికులు జే జే లు పలికారు


మహా కథనంతో
కదిలిన యంత్రాంగం
కొండాపూర్ అక్రమ కట్టడాలపై అధికారుల కొరడా
కళ్లు తెరిచిన రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాలు.. తక్షణ చర్యలకు రంగం సిద్ధం
రూ. 10 కోట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణ,
7 అంతస్తుల నిర్మాణ బాగోతంపై 'మహా' పత్రిక సంచలన కథనం
అక్రమార్కుల గుండెల్లో గుబులు..
వంతపాడిన అధికారుల పైనా వేటుకు కసరత్తు
బరితెగించిన అక్రమార్కులు
మహా ఎఫెక్ట్
ప్రత్యేక ప్రతినిధి, మహా:



# బరితెగించిన అక్రమార్కులు
## కొండాపూర్ సర్వే నెంబర్ 59 గల్లంతు
- ఆరు వందల గజాల ప్రభుత్వ స్థలం ఆక్రమణ
- విలువ రూ 10 కోట్ల పై మాటే.. నకిలీ పత్రాలతో అనుమతులు
- రెండు నిర్మాణాలకు స్టిల్ట్ ప్లస్ మూడు ఫ్లోర్లకు పర్మిషన్లు
- నిర్మించేది మాత్రం ఏడు ఫ్లోర్లు ఆపైన పెంట్ హౌస్ నిర్మాణాలు
- సర్వే నెంబర్ 60 లో జీహెచ్ఎంసీ అనుమతులు పొంది, సర్వే నెంబర్ 59 లో గల ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు
- టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే అక్రమ నిర్మాణాలు
- సీఎంసీ కమీషనర్ స్పందించాలంటున్న స్థానికులు

రాజధాని నడిబొడ్డు.. సైబరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని కొండాపూర్ లో అక్రమార్కులు బరితెగించారు.. ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు పక్కా స్కెచ్ వేసి దురాక్రమణకు తెగబడుతున్నారు.. నకిలీ పత్రాలు సృష్టించి జిహెచ్ఎంసి నుండి అనుమతులు పొంది నిర్మాణాలు సాగించటం ఇక్కడ పరిపాటిగా మారింది.. ఆరు వందల గజాల ప్రభుత్వ భూమి విలువ బహిరంగ మార్కెట్లో రూ 10 కోట్లు పైమాటే ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.. ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన కబ్జా దారులతో కుమ్మక్కయ్యారని ఎటువంటి చర్యలు తీసుకోలేదని బహిరంగ ఆరోపణలు వ్యక్తమౌతున్నాయి.. అనుమతులు మించి నిర్మాణాలు సాగిస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టౌన్ ప్లానింగ్ అధికారులు కనుసన్నల్లోనే...

సీ ఎం సి కమీషనర్ స్పందించాలంటున్న స్థానికులు

# విద్యార్థినులకు పీరియడ్స్ సెలవులు.



**తిరువనంతపురం, మహా.** దేశంలోనే సామాజిక భద్రత, మహిళా సాధికారతలో ఎల్లప్పుడూ ముందుండే కేరళ రాష్ట్రం మరో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో చదువుకునే విద్యార్థినులకు ప్రతినెలా మూడు రోజుల పాటు రుతుక్రమ (పీరియడ్స్) సెలవులు ఇవ్వాలని నూతనంగా ఏర్పడిన యూడీఎఫ్ ప్రభుత్వం నిర్ణయించింది. దీనితో పాటు అసంఘటిత రంగాల్లో పని చేస్తూ ఎలాంటి భద్రత లేని మహిళా కార్మికులకు పూర్తి జీతంతో కూడిన ఆరు నెలల ప్రసూతి (మెటర్నిటీ) సెలవులను వర్తింపజేయాలని తీర్మానించింది. కేరళ 16వ అసెంబ్లీ తొలి సమావేశాల సందర్భంగా రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఈ మేరకు ప్రభుత్వ నూతన విధానాలను సభలో అధికారికంగా ప్రకటించారు. ముఖ్యమంత్రి వీడీ సతీశన్ నేతృత్వంలోని నూతన ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజల ముందుకు ఉంచేందుకు త్వరలోనే సమగ్రమైన శ్వేతపత్రాన్ని విడుదల చేయనుందని గవర్నర్ వెల్లడించారు. ఇదే వేదికగా సామాన్య ప్రజలకు అండగా నిలిచే భారీ ఆరోగ్య బీమా పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత ఉమెన్ చాందీ స్మారకార్థం 'ఉమెన్ చాందీ ఆరోగ్య బీమా పథకం' పేరిట అర్హులైన ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య బీమా కల్పించనున్నట్లు సభలో ప్రకటించారు. ఏఐ సాంకేతికతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో ఒక 'మీడియా సిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

# ఎస్ఐఆర్‌పై.. అలసత్వం వద్దు



( మొదటి పేజీ తరువాయి )

.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ క్యాడర్ అంతా సోషల్ మీడియా వారియర్లుగా మారి, ప్రాణాలకు తెగించి పార్టీ కోసం పనిచేశారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు 'జమీందార్లు'గా తయారయ్యారని ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సదరు ఎమ్మెల్యేలు సోషల్ మీడియాలో కేవలం తమ వ్యక్తిగత ప్రచారం తప్ప.. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను అస్సలు ప్రచారం చేయనివ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి మారాలని, సోషల్ మీడియాను ఎలా ఉపయోగించాలనే అంశంపై ఎమ్మెల్యేలందరికీ ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు.

**పార్టీ కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాల్సిందే**

పార్టీ అధికారంలోకి రావడానికి కారణమైన కార్యకర్తలను, క్యాడర్‌ను ప్రజాప్రతినిధులు విస్మరించకూడదని సీఎం హెచ్చరించారు. "పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కచ్చితంగా పనిచేయాల్సిందే. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు... ఇలా ప్రతి ఒక్కరూ పార్టీ కార్యక్రమాల్లో తప్పనిసరిగా పాల్గొనాలి. ఇందులో నాతో పాటు ఎవరికీ ఎలాంటి మినహాయింపులు లేవు" అని రేవంత్ రెడ్డి కరాఖండిగా తేల్చి చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో దాదాపు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేశామని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

**కార్యకర్తలను కలుస్తా**

ఇకపై ఇన్చార్జ్ మంత్రులు ప్రతి 10 రోజులకు ఒక రోజును పూర్తిగా పార్టీ కార్యక్రమాల కోసమే కేటాయించాలని, నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి కార్యకర్తలను కలవాలని సీఎం ఆదేశించారు. కేవలం మంత్రులకే కాకుండా తనకు కూడా ఈ రూల్ వర్తిస్తుందని చెబుతూ.. తాను కూడా ప్రతి 10 రోజులకు ఒకసారి క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలను కలుస్తానని, నెలలో మూడు రోజులు కేవలం కార్యకర్తల కోసమే సమయం ఇస్తానని రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీంతో పాటు రాబోయే రోజుల్లో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు పోయిన కాంగ్రెస్ అనుకూల ఓటర్ల ఓట్లు తొలగిపోకుండా (డిలీట్ కాకుండా) చాలా జాగ్రత్త పడాలని పార్టీ నాయకులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు

# రైతుల డిస్కమ్ పెద్ద కుట్ర

( మొదటి పేజీ తరువాయి )

పచ్చిదగా చేస్తోందని విమర్శించారు.

**డిస్కమ్ ల పరిస్థితి అధ్వాన్నం**

ఇప్పటికే డిస్కమ్ ల పరిస్థితి బాగాలేదని ప్రభుత్వమే చెబుతోందని.. రైతులకు, లిఫ్ట్ ఇరిగేషన్ కు, ఫ్రీ కరెంట్ స్కీమ్ ఇచ్చే కరెంట్ కు ప్రభుత్వమే డబ్బులు ఇవ్వాలని చెప్పారు. ఇప్పటికే రూ. 25 వేల కోట్ల నష్టంలో డిస్కమ్ ను కంపెనీ పేరుతో రిజిస్టర్ చేస్తామంటున్నారని తెలిపారు. రెండున్నరేళ్లుగా ఈ ప్రభుత్వం వైఖరి చూస్తున్న వాళ్లెవరు కూడా ఇది రైతులకు మంచి చేసే నిర్ణయమని నమ్మరని స్పష్టం చేశారు. గతంలో ధరణి, కాంగ్రెస్ వచ్చాక భూమాత పేరుతో రైతులకు ఏ మేలు చేయలేదని విమర్శించారు. ఈ ప్రభుత్వం కారణంగా తెలంగాణ రైతాంగం మొత్తం మోసపోయిందన్నారు. రైతు డిస్కమ్ లో కచ్చితంగా తెలంగాణ వాళ్లే ఉండేలా చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. అదే విధంగా ఈ అంశంపై కచ్చితంగా అన్ని పార్టీలతో అఖిల పక్షం సమావేశం ఏర్పాటు చేయాలని చెప్పారు. డిస్కమ్ ల బకాయిల్లో మొదటి దోషి ప్రభుత్వమేనని.. డిస్కమ్ లు 69 వేల కోట్లు నష్టాల్లో ఉంటే 54 వేల కోట్లు ప్రభుత్వం నుంచే రావాల్సి ఉందని అన్నారు. కచ్చితంగా రైతుల మోటార్లకు మీటర్లు పెట్టే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని మండిపడ్డారు. యూనిట్ 6 రూపాయలు పడే థర్మల్ పవర్ ఇచ్చే ప్రయత్నం చేస్తూ ఒక డిస్కమ్ ను ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఒక వేళ డిస్కమ్ కు లెసెన్స్ ఇస్తే.. ప్రతి రైతు వద్దకుతాము వెళ్లి ప్రభుత్వ మోసపూరిత నిర్ణయాలను వాళ్లకు వివరిస్తామని స్పష్టం చేశారు.

# దేశానికి రుతుపవనాల షాక్

- **ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం.**
- **నైరుతిపై ఐఎండీ కీలక అంచనా.. ఎల్ నినో ప్రభావమే కారణం.**
- **జూన్‌లో ఏపీ సహా పలు రాష్ట్రాల్లో పెరగనున్న వడగాడ్పుల తీవ్రత.**



**ఢిల్లీ, మహా :** దేశ ఆర్థిక వ్యవస్థకు, వ్యవసాయ రంగానికి వెన్నెముక లాంటి నైరుతి రుతుపవనాలపై భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఆందోళనకరమైన అంచనాలను వెల్లడించింది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు బలహీనంగా ఉండే అవకాశం ఉందని తన తాజా నివేదికలో పేర్కొంది. 2026 రుతుపవన కాలానికి సంబంధించి విడుదల చేసిన దీర్ఘకాలిక అంచనాల ప్రకారం.. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో వర్షపాతం దీర్ఘకాల సగటు (ఎల్‌పీఏ) లో కేవలం 90 శాతానికి మాత్రమే పరిమితం కావొచ్చని స్పష్టం చేసింది. ఈ అంచనాల్లో 4 శాతం అటూ ఇటూగా మార్పులు ఉండొచ్చని తెలిపింది. తాజా అంచనాల ప్రకారం ఈసారి వర్షపాతం 'సాధారణం కంటే తక్కువ' కేటగిరీలోకి రానుండటంతో, ఇది సాగు నీటి లభ్యత, జలవనరులు మరియు ఖరీఫ్ సీజన్ పంటలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

ఈ ఏడాది రుతుపవనాలు బలహీనపడటానికి పసిఫిక్ మహాసముద్రంలో వేగంగా బలపడుతున్న 'ఎల్ నినో' పరిస్థితులే ప్రధాన కారణమని ఐఎండీ వివరించింది. సాధారణంగా ఎల్ నినో ప్రభావం ఉన్నప్పుడు రుతుపవన వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది. మరోవైపు, వర్షాలకు అనుకూలించే ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐఓడీ) ప్రస్తుతం తటస్థంగా ఉందని, రుతుపవన కాలం ముగిసే వరకు ఇదే పరిస్థితి కొనసాగే వీలుందని పేర్కొంది. ఈ భౌగోళిక మార్పుల నేపథ్యంలో, ఈ సీజన్‌లో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదయ్యేందుకు ఏకంగా 84 శాతం అవకాశం ఉందని ఐఎండీ స్పష్టం చేసింది. ఇటీవలి కాలంలో అత్యంత బలహీనమైన రుతుపవన సీజన్లలో ఒకటిగా ఇది మిగిలిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

ప్రాంతాల వారీగా వర్షపాతాన్ని విశ్లేషిస్తే.. దేశంలో అధిక వర్షాధార వ్యవసాయ ప్రాంతాలు ఉండే 'మాన్‌సూన్ కోర్ జోన్'లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉంటుందని ఐఎండీ అంచనా వేసింది. ఈశాన్య భారతంలో మాత్రం సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండగా.. వాయువ్య, మధ్య, దక్షిణ ద్వీపకల్ప భారతదేశంలో లోటు వర్షపాతం కంటిచూపుగా మారనుంది. అయితే, వాయువ్య, ఈశాన్య, తూర్పు భారతంలోని కొన్ని ప్రాంతాలతో పాటు దక్షిణ ద్వీపకల్పంలోని తూర్పు తీర ప్రాంతాలలో అక్కడక్కడా సాధారణం నుంచి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం కురిసే వీలుందని తెలిపింది.

ఇక, జూన్ నెలకు సంబంధించి దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో సాధారణం కన్నా తక్కువ వర్షపాతమే నమోదవుతుందని ఐఎండీ స్పష్టం చేసింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబ్, బీహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, గుజరాత్ వంటి పలు రాష్ట్రాల్లో ఎండ తీవ్రత పెరిగి, సాధారణం కంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈ భిన్నమైన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ శాఖలు, రైతాంగం ముందస్తుగా అప్రమత్తం కావాలని సూచించింది. నీటి యాజమాన్య పద్ధతులు పాటించడం, కరవును తట్టుకునే ప్రత్యామ్నాయ విత్తనాల ఎంపిక వంటి ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని సలహా ఇచ్చింది. కాగా, జులై నెలకు సంబంధించిన పూర్తిస్థాయి అంచనాలను జూన్ చివరి వారంలో విడుదల చేయనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

# రూ.1500కోట్ల విలువైన భూ కబ్జాకు యత్నం



**హైదరాబాద్, మహా** హైదరాబాద్ ప్రాంతంలో రూ.1,500 కోట్ల విలువైన భూమి కబ్జాకు యత్నించిన ఏపీకి చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారని శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. డీసీపీ ఈరోజు మీడియా సమావేశం నిర్వహించారు. నకిలీ పత్రాలతో బ్రహ్మనాయుడు, మరికొందరు కలిసి గండిపేటలో భూమి కబ్జాకు ప్రయత్నించారని తెలిపారు. గండిపేట తహసీల్దారు ఫిర్యాదుతో ఈ విషయం వెలుగు చూసిందని అన్నారు. గండిపేట సర్వే నెంబర్ 18లో భూమిని కబ్జా చేసేందుకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారని డీసీపీ వెల్లడించారు. నకిలీ పత్రాలను సృష్టించిన ముగ్గురు వ్యక్తులు నిమ్మల రాజేశ్ గౌడ్, వేణుగోపాల్, సాయి కిరణ్‌లను అరెస్టు చేసినట్లు చెప్పారు. అయితే మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేశ్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ సర్వే నెంబర్‌లోని భూమిని క్రమబద్ధీకరించిందని తప్పుడు జీవోలు సృష్టించారని, ఇవి సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయని అన్నారు. దీంతో అప్రమత్తమైన తహసీల్దారు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. చట్టబద్ధమైన హక్కులు లేకుండానే భూమిని విక్రయించాలని కుట్ర చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు డీసీపీ తెలిపారు. ఎకరా భూమిని రూ.3.5 కోట్లకు విక్రయించాలని నిర్ణయించుకున్నారని అన్నారు. కోర్టు ఆదేశాలతో నిందితుల ఇళ్లలో సోదాలు నిర్వహించి బ్యాంకు పాస్ పుస్తకాలు, మొబైల్, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ భూమికి సంబంధించి ఇప్పటికే డబ్బులు చేతులు మారినట్లు గుర్తించామని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు.

# త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు

**ముంబై, మహా :** దేశంలో త్వరలోనే సరికొత్త ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు చలామణిలోకి వచ్చేందుకు మార్గం సుగమమవుతోంది. మార్కెట్లో నగదుకు డిమాండ్ విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ దిశగా పకడ్బందీ అడుగులు వేస్తోంది. ఇటీవల పాట్నా, ముంబై నగరాల్లో నిర్వహించిన బోర్డు అత్యున్నత స్థాయి సమావేశాల్లో ప్లాస్టిక్ నోట్ల ప్రవేశపెట్టడంపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చలామణిలో ఉన్న సంప్రదాయ కాగితపు నోట్లతో పోలిస్తే ప్లాస్టిక్ నోట్ల ముద్రణ ఖర్చు చాలా తక్కువగా ఉండటం, అలాగే ఇవి ఎక్కువ కాలం మన్నికగా ఉండటమే కేంద్ర బ్యాంక్ ఈ నిర్ణయం వైపు మొగ్గు చూపడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో కేవలం కరెన్సీ నోట్ల ముద్రణ కోసమే ఆర్బీఐ ఏకంగా రూ. 6,372.8 కోట్ల భారీ మొత్తాన్ని ఖర్చు చేయాల్సి వచ్చింది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఈ వ్యయం గణనీయంగా పెరిగింది. ఒకవైపు డిజిటల్ లావాదేవీలు శరవేగంగా విస్తరిస్తున్నప్పటికీ, మార్కెట్లో నగదు చలామణి ఏమాత్రం తగ్గకుండా రికార్డు స్థాయిలో రూ. 42.86 లక్షల కోట్లకు చేరడం గమనార్హం. ఈ నేపథ్యంలో, కొత్తగా తీసుకురాబోయే ప్లాస్టిక్ నోట్లను ఖాతాదారులు సులభంగా విత్‌డ్రా చేసుకునేలా ఏటీఎం యంత్రాల్లోనూ అవసరమైన సాంకేతిక మార్పులు చేయనున్నారు. ఇందుకోసం త్వరలోనే దేశంలోని కొన్ని ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా ప్లాస్టిక్ నోట్లను విడుదల చేసేందుకు ఆర్బీఐ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

**ఆర్బీఐకి సవాల్**

మార్కెట్లో విపరీతంగా పాడైపోయిన, చిరిగిపోయిన నోట్లను సేకరించి వాటిని శాస్త్రీయంగా నిర్మూలించడం ఆర్బీఐకి పెద్ద సవాలుగా మారింది. గత ఏడాది కాలంలోనే రిజర్వ్ బ్యాంక్ సుమారు 23.8 బిలియన్ల పాత నోట్లను మార్కెట్ నుంచి వెనక్కి సేకరించింది. ఇందులో అత్యధికంగా రూ. 500, రూ. 100 ముఖవిలువ గల నోట్లే ఉండటం గమనార్హం. ఒకవేళ ప్లాస్టిక్ నోట్లు అందుబాటులోకి వస్తే నీటి వల్ల తడవవు, అంత సులువుగా చిరిగిపోవు కాబట్టి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆర్బీఐ భావిస్తోంది. గతంలో 2012వ సంవత్సరంలోనే అప్పటి యూపీఏ ప్రభుత్వం దేశంలోని ఐదు ప్రధాన నగరాల్లో రూ. 10 ప్లాస్టిక్ నోట్లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టాలని ప్రయత్నించినప్పటికీ, కొన్ని సాంకేతిక లోపాల వల్ల ఆ ప్రాజెక్ట్ అప్పట్లో ముందుకు సాగలేదు. అయితే ప్రస్తుతం పూర్తి స్థాయి అత్యాధునిక సాంకేతికత, అంతర్జాతీయ అనుభవాలు అందుబాటులోకి రావడంతో ఆర్బీఐ ఈ ప్రతిపాదనను మళ్లీ తెరపైకి తెచ్చింది

# అక్రమ ఇసుక తవ్వకాలపై ఈడీ కొరడా.

**హైదరాబాద్, మహా.** ఆంధ్రప్రదేశ్‌లో గతంలో జరిగిన భారీ ఇసుక కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కొరడా ఝుళిపించింది. ఉమ్మడి రాష్ట్ర గనుల శాఖ మాజీ డైరెక్టర్ వి.జి.వెంకటరెడ్డి సహా పలువురు బడా కాంట్రాక్టర్లు, నిర్మాణ సంస్థలపై ఏకకాలంలో దాడులు నిర్వహించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద హైదరాబాద్, జైపూర్, కోయంబత్తూరు తదితర ఎనిమిది ప్రాంతాల్లో ఈనెల 26న విస్తృత సోదాలు చేపట్టినట్లు ఈడీ హైదరాబాద్ జోనల్ కార్యాలయం తాజాగా ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించింది.

**ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాల్లో జల్లెడ..**

ఈ దాడుల్లో మెసర్స్ జీసీకేసీ ప్రాజెక్ట్స్ అండ్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్, మెసర్స్ ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, మెసర్స్ టర్న్‌కీ ఎంటర్‌ప్రైజెస్ తదితర సంస్థల అధికారిక కార్యాలయాలను అధికారులు జల్లెడ పట్టారు. వీటితో పాటు హైదరాబాద్, జైపూర్‌లలోని బోయినపల్లి శ్రీనివాసరావు, అశోక్ కుమార్, వి.జి.వెంకటరెడ్డిల నివాసాలతో పాటు, బోయినపల్లి శ్రీనివాసరావుకు చెందిన ఫామ్‌హౌస్‌లోనూ సోదాలు జరిగాయి. ఈ తనిఖీల్లో లెక్కల్లో చూపని రూ. 1.53 కోట్ల భారతీయ నగదు, 1800 అమెరికన్ డాలర్లు, రూ. 1.29 కోట్ల విలువైన వెండి కడ్డీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పలు కీలక డిజిటల్ పరికరాలతో పాటు నిందితులు, వారి కుటుంబ సభ్యుల పేర్ల మీదున్న చరాస్తులు, స్థిరాస్తులకు సంబంధించిన కీలక పత్రాలను సీజ్ చేశారు.

**రూ. 2,407 కోట్ల జరిమానా వసూలుకు నోటీసులు..**

అసలు ఈ దర్యాప్తునకు ప్రధాన కారణం విజయవాడ (ఎన్టీఆర్ జిల్లా) అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నమోదు చేసిన ఎఫ్ఐఆర్ అని ఈడీ పేర్కొంది. టెండర్ల నిబంధనలను ఉల్లంఘించి అక్రమ ఇసుక తవ్వకాలకు పాల్పడిన వ్యవహారంలో మాజీ గనుల శాఖ డైరెక్టర్ వి.జి. వెంకటరెడ్డితో పాటు జైప్రకాష్ పవర్ వెంచర్స్ లిమిటెడ్ (జేపీవీఎల్), ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, జీసీకేసీ ప్రాజెక్ట్స్ సంస్థలపై ఏసీబీ గతంలో కేసు నమోదు చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇసుక తవ్వకాలపై విచారణ జరిపిన జిల్లా స్థాయి ఇసుక కమిటీలు (డీఎస్ఎల్‌సీ).. ఈ మూడు సంస్థలు అనుమతించిన లోతు కంటే విపరీతంగా తవ్వకాలు జరపడంతో పాటు, అసలు అనుమతి లేని ప్రాంతాల్లోనూ అక్రమంగా ఇసుకను తోడేసినట్లు నిర్ధారించాయి.

**బయటపడ్డ డొంక..**

డీఎస్ఎల్‌సీ ఇచ్చిన నివేదికల ఆధారంగా ఈ ఉల్లంఘనలపై అప్పట్లో గనుల శాఖ డైరెక్టర్ కార్యాలయం సదరు సంస్థలకు షోకాజ్ నోటీసులతో పాటు డిమాండ్ నోటీసులు జారీ చేసింది. అక్రమాలకు పాల్పడిన ఆ మూడు సంస్థల నుంచి ఏకంగా రూ. 2407.70 కోట్ల పెనాల్టీ వసూలు చేయాలని డిమాండ్ నోటీసుల్లో స్పష్టం చేసినట్లు ఈడీ తన విచారణలో గుర్తించింది. ఏసీబీ నమోదు చేసిన కేసుకు తోడు, ఈ భారీ కుంభకోణంలో జరిగిన మనీ లాండరింగ్ కోణాన్ని వెలికితీసేందుకు తదుపరి దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోందని అధికారులు స్పష్టం చేశారు.

# ఎస్ ఐ ఆర్ పై ఈసీ కాన్ఫరెన్స్

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో త్వరలోనే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ మొదలు కాబోతున్న నేపథ్యంలో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరును జాబితాలో చేర్చి, అనర్హుల పేర్లను తొలగించాలని ఆదేశించారు. ఎన్నికల యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా జిల్లా ఎన్నికల అధికారులు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, బీఎల్వో సూపర్ వైజర్లు తదితర ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే, సర్ ప్రక్రియలో ఐటీ సంబంధిత అంశాలతో పాటు చట్టపరమైన నిబంధనలు, ప్రక్రియలో వివిధ దశలు, విధానాలపై రాష్ట్ర నోడల్ అధికారి పలు సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న పలువురు అధికారులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారితో పాటు సంబంధిత విభాగాల సిబ్బంది



# రాజ్యసభకు షర్మిల? రాహుల్ గాంధీతో భేటీ

**ఢిల్లీ, మహా :** కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీతో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల భేటీ అయ్యారు. కర్ణాటకలో త్వరలో రాజ్యసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆమె పార్టీ అగ్రనాయకుడితో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కర్నాటక నుండి రాజ్యసభకు పంపుతామని వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసిన సమయంలో షర్మిలకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం హామీనివ్వగా, ఇపుడు అవకాశం ఇస్తే ఏపీలోనూ పార్టీకి ఉపయోగకరంగా ఉంటుందని ఆమె కోరినట్లు తెలిసింది. ఢిల్లీలో జరిగిన ఈ భేటీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉన్నారు. ఇప్పుడు కర్ణాటకలో రాజ్యసభ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో, ఏపీలో పార్టీని బలోపేతం చేయడానికి, రాజ్యసభలో కాంగ్రెస్ తరపున ఏపీ గొంతును వినిపించడానికి తనకు రాజ్యసభ సీటును ఇవ్వాలని ఆమె కోరుతున్నారని తెలుస్తోంది.

రాహుల్ గాంధీతో భేటీ అనంతరం షర్మిల కారులో వెళుతుండగా మీడియా పలకరించింది. ఈ సమావేశంలో ఎప్పటిలా సాధారణ సమీక్ష జరిగిందని ఆమె పేర్కొన్నారు. కాగా కర్నాటక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకుంటామని హైకమాండ్ హామీ నిచ్చినట్లు తెలుస్తోంది.



# పవన్ ఒక ప్యాకేజ్ స్టార్

**జడ్చర్ల, మహా :** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్‌ను ఒక 'ప్యాకేజ్ స్టార్' అని అభివర్ణిస్తూ, భవిష్యత్తులో వైఎస్ జగన్ ఎక్కువ ప్యాకేజీ ఇస్తే ఆయనకు మద్దతు ఇవ్వడానికి కూడా వెనుకాడరని ఎద్దేవా చేశారు. ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌ను విమర్శించే స్థాయి, అర్హత పవన్ కల్యాణ్‌కు లేవని అనిరుధ్ రెడ్డి అన్నారు. "దమ్ముంటే తెలంగాణకు వచ్చి ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను అరెస్ట్ చేయండి. ఆయన ఇంటి ముందు నేను అడ్డుగా నిలబడతా" అంటూ పవన్‌కు బహిరంగ సవాల్ విసిరారు. తెలంగాణ బిడ్డల జోలికి ఆంధ్రప్రదేశ్ నుంచి ఎవరైనా రావాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, అవసరమైతే మళ్లీ 'గో బ్యాక్ ఆంధ్ర' ఉద్యమం మొదలవుతుందని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏపీ రాజకీయ నేతల తీరుపై ఆయన మండిపడ్డారు. "మీరంతా ఉండేది హైదరాబాద్‌లో, ఆస్తులు సంపాదించుకునేది ఇక్కడే. మరి అన్ని వేల కోట్లు పెట్టి అమరావతిని ఎందుకు కట్టుకుంటున్నారు?" అని ప్రశ్నించారు. రాజకీయాల కోసం ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం సరికాదని, తెలంగాణ ప్రజలను తక్కువ చేసి మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు.

# తెలంగాణలో ఉండాలంటే వీసా కావాలా?

**హైదరాబాద్, మహా :** "తెలంగాణలో బతకాలంటే ప్రత్యేక పాస్‌పోర్ట్, వీసా ఏమైనా కావాలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు?" అంటూ ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను ఉద్దేశించి 'వెంటనే జూబ్లీహిల్స్ వదిలి వెళ్లిపోవాలి' అంటూ బెదిరింపులకు దిగిన కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్‌పై సుమోటోగా కేసు నమోదు చేయాలని తెలంగాణ డీజీపీని విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఒక ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తులకే ఇలాంటి బహిరంగ బెదిరింపులు వస్తే, ఇక తెలంగాణలో సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఐదు కోట్ల మంది ఆంధ్రులను అవమానించడమేనని అన్నారు. తెలంగాణ ప్రజలు అందరినీ ప్రేమించే వారని, కానీ కొందరు రాజకీయాల కోసం రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ANN తెలుగు

# మహా పత్రిక

03

శనివారం, హైదరాబాద్ | 30-05-2026 | జనరల్ వార్తలు | GENERAL NEWS | WWW.MAHAADAILY.COM

# ఒక్క ఓటు కూడా డిలిట్ కావొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఈ పరిస్థితుల కారణంగా దళితులు, మైనార్టీలు, మహిళల ఓట్లు తొలగిపోయే (డిలీట్ అయ్యే) అవకాశం ఉందని, కాబట్టి వలసలు పోయిన వారి ఓట్లు పోకుండా చాలా జాగ్రత్త పడాలని సూచించారు. ఎస్ఐఆర్ వల్ల తలెత్తే ఇరుకులను అధిగమించడానికి, సమస్యల పరిష్కారంపైన నాయకులంతా సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని స్పష్టం చేశారు. గతంలో బూత్ ఎన్‌రోలర్ల సహాయంతో కేవలం 90 రోజుల్లోనే 45 లక్షల డిజిటల్ మెంబర్‌షిప్ చేయించామని, ఎక్కువ సభ్యత్వం నమోదు చేయించిన వారికి రాహుల్ గాంధీ చేతుల మీదుగా సన్మానం కూడా చేయించామని సీఎం గుర్తుచేశారు. నాడు కాంగ్రెస్ సభ్యత్వ నమోదులో కీలక పాత్ర పోషించిన ఎన్‌రోలర్ల సేవలను ఇప్పుడు ఎస్ఐఆర్ విషయంలో కూడా పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. డిజిటల్ మెంబర్‌షిప్ కోసం గతంలో ప్రతి నియోజకవర్గంలో ఒక ఇంఛార్జ్‌ను నియమించి పర్యవేక్షించినట్లే.. ఇప్పుడు ఎస్ఐఆర్ కోసం రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు, 17 లోక్‌సభ నియోజకవర్గాలకు ప్రత్యేకంగా ఇంఛార్జ్‌లను నియమించాలని ఆదేశించారు. అసెంబ్లీ ఇంఛార్జ్‌లు తప్పనిసరిగా తమకు కేటాయించిన నియోజకవర్గాల్లోనే ఉండి పని చేయాలని, వారు కరెక్ట్‌గా రంగంలో ఉంటే ఒక్క ఓటు కూడా డిలీట్ కాకుండా కాపాడుకోవచ్చని భరోసా ఇచ్చారు.

**నామినేటెడ్ పోస్టులన్నీ దాదాపు భర్తీ చేశాం**

ఇప్పటికే రాష్ట్రంలో దాదాపు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేశామని, ప్రస్తుతం పార్టీ తరఫున వేలాది మంది సర్పంచ్‌లు, మున్సిపల్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు బలంగా ఉన్నారని సీఎం గుర్తుచేశారు. ఈ క్రమంలోనే రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు హైదరాబాద్ నగర పరిధిలో ప్రత్యేక బాధ్యతలు అప్పగించాలన్నారు. హైదరాబాద్ నగరం పరిధిలోని 15 నియోజకవర్గాలలో ఎస్ఐఆర్ పైన అసెంబ్లీల వారీగా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని, అలాగే మహిళా కాంగ్రెస్ తరఫున క్లస్టర్ల వారీగా సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. పార్టీ సీనియర్లు, మాజీ పీసీసీ అధ్యక్షుల సలహాలు, సూచనలు తీసుకుంటూ.. నాయకులంతా పూర్తి సమన్వయంతో ముందుకు వెళ్లాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# ఎమ్మెల్యే పాయల్ శంకర్ కు దమ్ముంటే ప్రమాణం చెయ్యాలి: గిమ్మ సంతోష్ రావు

- నీపై చేసిన వ్యాఖ్యలకు ప్రమాణం చేయడానికి కంది శ్రీనివాస రెడ్డి సిద్ధం
- ఎమ్మెల్యే సిద్ధంగా ఉంటే ప్రమాణం తేదీ ఖరారు చేయాలని సవాల్




**ఆదిలాబాద్ మహా** : ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్నాల నగేష్ చేసిన ఆరోపణలను ఖండిస్తున్నట్టు ఆదిలాబాద్ ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ప్రెస్ క్లబ్ లో మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ పై తమ నేత కంది శ్రీనివాస రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి అసత్యం లేదన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ తనను కాంగ్రెస్ ఎమ్మెల్యేగా అనుకోండని పేషీల్లో చెప్పినట్టుగా,, అలాగే ఎన్నికలకు ఆరునెలల ముందు కాంగ్రెస్ లో చేరి రానున్న ఎన్నికలలో ఆ పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని పలువురు కౌన్సిలర్లు రాజకీయ నాయకులతో చెప్పింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అందుకే ఎమ్మెల్యే శిఖండి రాజకీయాలు చేస్తున్నాడన్న వ్యాఖ్యలకు కంది శ్రీనివాస రెడ్డి కట్టుబడి జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో కుటుంబ సభ్యులతో సహా తడిబట్టలతో ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నాడని నీవు అలాగే నీ కుటుంబంతో కలిసి ప్రమాణం చేయడానికి సిద్ధమా అని సవాల్ విసిరారు. దమ్ముంటే ఆయన అలా మాట్లాడలేదని ప్రమాణం చేసి తన సచ్ఛీలత నిరూపించుకోవాలని అన్నారు. కంది శ్రీనివాస రెడ్డి పై ఆరోపణలు చేస్తున్న నాగేష్ ఎమ్మెల్యే ను సంప్రదించి ప్రమాణం చేసే తేదీని ఖరారు చేయాలని కోరారు. ప్రమాణం చేసేవరకు బరాబర్ శిఖండి రాజీయాలు చేస్తున్నాడని వ్యభిచార కాజకీయాలు చేస్తున్నాడని విమర్శిస్తూనే ఉంటామన్నారు. అనవసరంగా తమ నేత కంది శ్రీనివాస రెడ్డి పై అవాకులు చవాకులు పేలితే సహించేదీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చరణ్ గౌడ్ , ఇజ్జగిరి సంజయ్, జీషాన్ అలీ, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి , కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఖిజర్ పాషా, మాజీ కౌన్సిలర్ బండారి సతీష్ , నాయకులు సింగిరెడ్డి రాంరెడ్డి , తమ్మల చందు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



# నూతన కార్యవర్గాలకు కంది శ్రీనివాస రెడ్డి సత్కారం

**ఆదిలాబాద్ మహా** : ఇటీవల నూతనంగా ఎన్నికైన ఆదిలాబాద్ తాలూకా మున్నూరు కాపు సంక్షేమ సంఘ బాధ్యులు , ఆదిలాబాద్ బులియన్ మార్కెట్ సంఘ బాధ్యులు పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. వారికి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సాదరంగా స్వాగతం పలికారు. మున్నూరు కాపు సంఘ అధ్యక్షకార్యదర్శులు తోట శివన్న, కర్మర్గుల సంతోష్, ఉపాధ్యక్షులు ఆవుల శరత్, కోశాధికారి వడ్డారపు విట్టల్ తో పాటు కార్యవర్గ సభ్యులను, అలాగే బులియన్ మార్కెట్ అధ్యక్షులు బొల్లు దేవిదాస్, జనరల్ సెక్రటరీ కట్ట రాజు, ట్రెజరర్ వడ్డారపు దేవిదాస్ తో పాటు మిగతా కార్యవర్గ సభ్యులను కంది శ్రీనివాస రెడ్డి శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. తమ సంఘాల అభివృద్ధి కోసం నూతన కార్యవర్గాలు కృషి చేస్తాయని ఆకాంక్షించారు. కార్యవర్గాలకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, నాయకులు కొండ గంగాధర్ , మాజీ కౌన్సిలర్ బండారి సతీష్ , కోల నర్సింలు, సింగిరెడ్డి రాంరెడ్డి , ప్రభావతి ,రమ, చిన్నయ్య, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు ప్రజలు అధికారుల కృషి అవసరం

- --మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య



**మంచిర్యాల, మహా** :బాల్య వివాహాల నిర్మూలనకు ప్రజలు అధికారుల కృషి అవసరమని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సముదాయం సమావేశ మందిరంలో ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో మహిళా సంక్షేమ వారోత్సవాలలో భాగంగా బాల్య వివాహాల నిర్మూలనపై డిసిపి భాస్కర్ తో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బాల్య వివాహాల నిర్మూలనపై గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వెల్లడించారు. రానున్న రోజుల్లో మంచిర్యాల జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంగా అధికారులు కృషి చేయాలని వివరించారు. బాల్య వివాహాలు సమాజ అభివృద్ధికి అడ్డంకిగా మారుతున్నాయని, చిన్న వయస్సులో వివాహాలు జరగడం వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. బాల్య వివాహాల నిరోధక చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహాలు జరపడం చట్ట విరుద్ధమని చెప్పారు. తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత సమాజంలో అవగాహన పెంపొందించి బాల్య వివాహాలను అరికట్టేందుకు బాధ్యతయుతంగా వ్యవహరించాలని కోరారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, బెల్లంపల్లి ఎ సి పి లు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రి జీఎంకు

# వినతులు చేసినా ఫలితం శూన్యం..!

- --కూలిపోయిన సెప్టిక్ ట్యాంక్‌తో కాలనీవాసుల నరకయాతన
- -- సంతకాలతో వినతులు చేసి సంవత్సరం కావస్తున్న పట్టించుకోని వైనం



**మందమర్రి, మహా** : మందమర్రి ఏరియా ఒకటవ జోన్ లోని సింగరేణి కాలనీలో సెప్టిక్ ట్యాంక్ కూలిపోయిందని కాలనీవాసులు స్వయంగా ఏరియా జీఎం కు లిఖితపూర్వక ఫిర్యాదులు చేసిన సంబంధిత సివిల్ అధికారులు పట్టించుకోవడం లేదు. గత వర్షాకాలంలో సదరు కాలనీవాసులంతా సంతకాలు చేసి జిఎంకు వినతిపత్రం సమర్పించినా ఇప్పటివరకు మరమ్మతు పనులకు మోక్షం లభించలేపోవడం పలు విమర్శలకు తావునిస్తోంది. తద్వారా కాలనీవాసులు దుర్గంధం కంపుతో రోగాల బారిన పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.... గత సంవత్సరం వర్షాకాల సమయంలో ఒకటవ జూన్ కాలనీ సెప్టిక్ ట్యాంక్ కూలిపోయింది. ఇక్కడ దుర్గంధం వెదజల్లుతున్న దృశ్య నివారణ చర్యలు చేపట్టాలని కాలనీవాసులు పలువురు సంతకాలు చేసి ఏరియా జిఎం కార్యాలయంలో అందజేసినట్లు తెలుస్తోంది. కానీ ఇప్పటివరకు సివిల్ అధికారులు అటువైపు చూసి నివారణ చర్యలు చేపట్టినట్లు జాడలు కానరావడం లేదు.

**కూలిన ట్యాంక్ - నరకం చూస్తున్న కాలనీ వాసులు**

మందమర్రి ఏరియాలోని ఒకటవ జోన్ కాలనీలో గత 10 నెలల క్రితం సెప్టిక్ ట్యాంక్ పూర్తిగా కూలిపోయింది. దీంతో భరించలేని మురుగునీరు వాసన వల్ల కాలనీవాసులు ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంది. దీనివల్ల పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారు. దోమల బెడదతో డెంగ్యూ, మలేరియా వస్తాయేమోనని భయంగా ఉందని అని స్థానిక కాలనీ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**జీఎంకు సంతకాల వినతి - అయినా స్పందన శూన్యం**

ఈ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులంతా ఏకమై సంతకాల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. దాదాపు 30 కుటుంబాల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్‌కు అందజేశారు. అయినా నెలలు గడుస్తున్నా టెండర్ పిలవడం లేదు, పనులు మొదలుపెట్టడం లేదు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా 'చూస్తాం, చేస్తాం' అంటారే తప్ప కార్యరూపం దాల్చడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు.

**అధికారుల చిత్రాలు - కాగితాలకే పరిమితం**

సింగరేణి అధికారులు కేవలం ఫైళ్లలో, కాగితాల్లోనే అభివృద్ధిని చూపిస్తున్నారని కార్మికులు మండిపడుతున్నారు. "కోట్ల రూపాయల లాభాలు ఆర్జిస్తున్న కంపెనీకి కార్మిక కాలనీలో ఒక సెప్టిక్ ట్యాంక్ కట్టించే సోయి లేదా..?" అని ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తుండటంతో మురుగునీరు ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకు క్రితం బాత్రూం లోకి పాములు సైతం వచ్చిన దాఖలాలు అనేకం ఉండడంతో భయం గుప్పెట్లో కాలనీవాసులు కాలం వెల్లడిస్తున్నారు.

**యూనియన్ ప్రతినిధులు ఏం చేస్తున్నారు..?**

ఈ విషయంపై స్థానిక యూనియన్ ప్రజా ప్రతినిధులు నోరు మెదపడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఓట్లప్పుడు మాత్రమే కాలనీలు గుర్తుకొస్తాయి. సమస్యలు తీర్చమంటే మాత్రం కనిపించరని కాలనీ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారులు చొరవ తీసుకోవాలి

ఈ విషయంపై తక్షణమే సింగరేణి యాజమాన్యం చొరవ తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. కార్మికు సంక్షేమం పట్టించుకోవడం మానేసి లాభాల వేటలో పడిందన డానికి ఈ సెప్టిక్ ట్యాంక్ ఉదంతమే నిదర్శనమని బస్తీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఏరియా జీఎం, సివిల్ విభాగం అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని కోరారు. అలా కాని పక్షంలో కాలనీవాసులు ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.



# బెల్లంపల్లి పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

**బెల్లంపల్లి, మహా**: బెల్లంపల్లి పట్టణాభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతీ రమేష్ బాబు శుక్రవారం నాడు కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అవసరమైన నిధులు కేటాయించాలని,మున్సిపల్ పరిధిలోని వివిధ సమస్యలను, అవసరమైన ప్రగతి పనులను గూర్చి సీఎం కి వివరించడం జరిగింది..ప్రస్తుత బెల్లంపల్లి మున్సిపాలిటీ స్థితిగతులను వివరించి అభివృద్ధి కొరకు గాను ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేయగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి మున్సిపాలిటీ అభివృద్ధి కొరకు నిధుల మంజురుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే కఠిన చర్యలు

**మహా వరంగల్ బ్యూరో ;** బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసే వారి పై చట్టపరమైన చర్యలు తప్పని సరిగా చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.

శుక్రవారం జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పొగాకు నియంత్రణ చట్టం జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పొగాకు మరియు పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే తీవ్రమైన ఆరోగ్య సమస్యల పై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలో సిగరెట్లు, గుట్కా మరియు ఇతర పొగాకు ఉత్పత్తుల విక్రయం నిషేధమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

దేవాలయాలు, పాఠశాలలు, పార్కులు, ప్రభుత్వ కార్యాలయాల తో పాటు ఇతర బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధించబడిందని పేర్కొంటూ, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**దుష్పరిణామాల పై ప్రజలకు అవగాహన**

పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై యువత ను భాగస్వామ్యం చేస్తూ ర్యాలీలు, అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో పొగత్రాగడం వల్ల పరిసరాల్లో ఉన్న వారిపై కూడా తీవ్ర ప్రభావం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ నెల 31న నిర్వహించే ప్రపంచ పొగాకు నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ప్రముఖ గుండె వైద్య నిపుణులు, శ్రీనివాస హార్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ రామకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు పొగాకు వల్ల కలిగే అనర్థాలపై పాఠశాల స్థాయి నుంచే అవగాహన కల్పించేలా పాఠ్యాంశాలు రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సంస్థలు, పారిశ్రామిక ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాల్లో నిషేధిత బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో పొగాకు సాగును నియంత్రించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య జిల్లాలో చేపడుతున్న పొగాకు నియంత్రణ కార్యక్రమాలపై వివరాలు వెల్లడించారు.

ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి మేన శ్రీను, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, జీడబ్ల్యూఎంసీ ముఖ్య వైద్యాధికారి డాక్టర్ రాజారెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి గోపాల్, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, జిల్లా రవాణా శాఖ అధికారి వేణుగోపాల్, గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ సునీత, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో ఆరుగురు అరెస్ట్

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ సబ్ డివిజన్ మట్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ, హత్యానేరానికి పాల్పడిన ఆరుగురు నిందితులను పోలీసులు అనతి కాలంలోనే అత్యంత చాకచక్యంగా అరెస్ట్ చేశారు. భారతీయ న్యాయ సంహిత బిఎన్ ఎస్ లోని 109, 189 తో పాటు 190 సెక్షన్ల ల కింద క్రైమ్ నెంబర్ 254/2026 గా కేసులు నమోదయ్యాయి.

ఇన్స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం సిలివేరు చందు (ఏ1), మిద్దెపాక అభినంద్ అలియాస్ సిద్దు (ఏ2), మహమ్మద్ గౌస్ ఖాన్ అలియాస్ అబ్బు (ఏ3), మిద్దెపాక పాల్సన్ (ఏ4), చెరుకు శివసాయి (ఏ5) తో పాటు ఎరుకొండ వినయ్ (ఏ6) లుగా గుర్తించబడిన నిందితులను పోతననగర్ లోని మోడ్రన్ ధోబీ ఘాట్ సమీపంలో శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 2026 మే 24 తేదీ రాత్రి సుమారు 11:00 గంటల సమయంలో హంటర్ రోడ్డులోని ఏడు మోరీల వద్ద గల శ్రీ కార్తికేయ ఐరన్ హార్డ్‌వేర్ షాప్ సమీపంలో, పాత కక్షలను మనసులో ఉంచుకుని ఈ నిందితులంతా ఒక ముఠాగా ఏర్పడి, కూరగాయలు కోసే కత్తి, కర్రల తో పాటు బీరు సీసాతో ఫిర్యాదుదారుడైన బతుక ఉత్తమ్ కిషోర్, అతని స్నేహితుల పై తీవ్రంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ సందర్భంగా బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సబ్‌ఇన్స్పెక్టర్ డి సాంబయ్య అతని దర్యాప్తు బృందం, మే 29 వ తేదీన నిందితులందరినీ అరెస్ట్ చేయడమే కాకుండా, దాడికి ఉపయోగించి దాచిపెట్టిన రక్తపు మరకలున్న కత్తిని కూడా స్వాధీనం చేసుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం నిందితులను వరంగల్ లోని III అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచి, 15 రోజుల జుడీషియల్ రిమాండ్ కు తరలించిన్నట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. అంతేకాకుండా ఈ కేసు పూర్వాపరాలన్నీ 25426 రిమాండ్ మట్వాడ 109 బిఎన్ఎస్.డిఓసి అనే ఫైల్ నందు పొందుపరచబడ్డాయి. ఈ సంఘటన నేపథ్యంలో వరంగల్ పోలీస్ శాఖ వారు నగరంలోని రౌడీ షీటర్లకు, అల్లరి మూకలకు చట్టవ్యతిరేకమైన పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసింది. నగరంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, ప్రజలను భయబ్రాంతులకు గురిచేసిన లేదా వీధి గొడవలకు పాల్పడినా వారి పై పోలీసులు ఉక్కుపాదం మోపుతారని, కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుని తక్షణమే జైలుకు కూడా పంపుతామని స్పష్టం చేశారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

మహా వరంగల్ బ్యూరో : వరంగల్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంగా నిT ర్వహించి, కొనుగోలు చేసిన వడ్లను వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన సమీక్షలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాముగర్లతో కలిసి రైస్ మిల్లర్లు, కాంట్రాక్టర్లు, మండల ఏపీఎంలు (డీఆర్‌డీఏ), నోడల్ అధికారులు (డీసీఓ)లతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు సకాలంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని సూచించారు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మిల్లర్లు ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు.

రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా ఓపీఎంఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత ఇన్‌చార్జ్‌లకు సూచనలు చేశారు. జిల్లాలో ఎక్కడా గన్ని సంచుల కొరత అలాగే రవాణా వాహనాల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో జడ్పి సీఈఓ రామ్ రెడ్డి, వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సుమా ఉమా రాణిలు, జిల్లా రవాణా శాఖ అధికారి శోభన్ బాబు, డీఎంసీఎస్ సంధ్యారాణి, డీసీఎస్ఓ, కిష్టయ్య, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి సంబంధిత అధికారులు బొల్లికుంట పిపిసి సెంటర్ ను తనిఖీ చేశారు. పీపీసీలో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలను రేపటిలోగా మిల్లులకు తరలించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత శాఖ అధికారులు రైతులు ఉన్నారు.



# భారత్‌లో నయా ట్రెండ్ నైట్ టూరిజం

**రాత్రి వేళల్లో రమణీయత**
**నిశీధి నిశ్శబ్దంలో ప్రకృతి ఆస్వాదన**
**ఆకాశంలో నక్షత్రాల తివాచీ అయినా..**
**ఇటు గంగా తీరాన ఆధ్యాత్మిక పారవశ్యమైనా**



పర్యాటక రంగంలో సరికొత్త విప్లవం... రాత్రి వేళల రమణీయత. ఒకప్పుడు సూర్యుడు అస్తమిస్తే పర్యాటకానికి తెరపడినట్టే భావించేవారు. కానీ నేడు, చీకటి పడ్డాకే అసలైన పర్యాటక వైభవం మొదలవుతోంది. భారత్‌లో ప్రస్తుతం 'నైట్ టూరిజం' ఒక సరికొత్త క్రేజ్‌గా దూసుకుపోతోంది. పగటిపూట ఉండే రద్దీ, ఉక్కపోతలకు దూరంగా... ప్రశాంతమైన వాతావరణంలో ప్రకృతి అందాలను కాంక్షించే వారికి ఇది ఒక వరంలా మారింది. కేవలం కాలక్షేపం కోసమే కాకుండా, మానసిక ఒత్తిడిని దూరం చేసుకుని రీఛార్జ్ అవ్వడానికి పర్యాటకులు ఈ మధురమైన అనుభూతిని సొంతం చేసుకుంటున్నారు."

(మహా ప్రత్యేకం)



## దేదీప్యమానం.. అదే ఆకర్ష మంత్రం

**1. విద్యుత్ కాంతుల్లో చారిత్రక వైభవం**
"సూర్యాస్తమయం కాగానే మన దేశంలోని చారిత్రక కట్టడాలు సరికొత్త నవవధువులా అలంకరించుకుంటాయి. ఆగ్రాలోని శ్వేతసౌధం తాజ్ మహల్ వెన్నెల కాంతుల్లో మెరిసిపోతుంటే, ఢిల్లీలోని ఎర్రకోట, హైదరాబాద్ చార్మినార్ వంటి కట్టడాలు రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగుల్లో దేదీప్యమానంగా ప్రకాశిస్తాయి. పగటిపూట కేవలం రాతి కట్టడాలుగా కనిపించే ఇవి, రాత్రి వేళల్లో లైట్ అండ్ సౌండ్ షోల ద్వారా చరిత్రను కళ్ళకు కడుతూ పర్యాటకులకు ఒక మంత్రముగ్ధమైన అనుభూతిని అందిస్తున్నాయి."

**2. నక్షత్రాల లోగిలి.. స్టార్ గేజింగ్**
"కనుచూపు మేర కాంక్రీట్ అరణ్యాలు, కాలుష్యపు పొరలు కమ్మేసిన నగర జీవితంలో ఆకాశంలో ఒక్క నక్షత్రాన్ని చూడటమే గగనమైపోయింది. అందుకే, కాలుష్యానికి ఆమడ దూరంలో, నిశీధి ఆకాశంలో నక్షత్రాల తివాచీని తలపించే 'స్టార్ గేజింగ్' సరికొత్త క్రేజ్‌గా మారింది. లడఖ్‌లోని స్ఫటికం లాంటి స్వచ్ఛమైన ఆకాశం, జైసల్మేర్ ఎడారి ఇసుక తిన్నెలపై నుండి కనిపించే పాలపుంత  అందాలను వీక్షించడానికి పర్యాటకులు ఎగబడుతున్నారు. ఖగోళ వింతలను చూస్తూ ప్రకృతితో మమేకమవ్వడానికి ఇదొక అద్భుతమైన మార్గం."

**3. నిశీధిలో వన్యప్రాణుల విహారం.. నైట్ సఫారీ**
"పగటిపూట చెట్ల నీడల్లో, గుహల్లో విశ్రాంతి తీసుకునే అడవి జంతువులు.. రాత్రి వేళల్లో ఎలా వేటాడుతాయి? వాటి జీవనశైలి ఎలా ఉంటుంది? అనే ఉత్సుకత పర్యాటకులను 'నైట్ సఫారీ' వైపు నడిపిస్తోంది. మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోని దట్టమైన అరణ్యాల మధ్య, జీపుల్లో హెడ్‌లైట్ల వెలుతురులో వన్యప్రాణులను అత్యంత సమీపం నుండి చూడటం పర్యాటకులకు రోమాంచితమైన (Thrilling) అనుభూతిని ఇస్తోంది. ప్రకృతి ఒడిలో సాహసాన్ని ఇష్టపడే వారికి ఇది పండగే!"

**4. గంగా తీరాన ఆధ్యాత్మిక పారవశ్యం**
"రాత్రివేళ పర్యాటకం అంటే కేవలం వినోదమే కాదు.. అంతకుమించిన ఆధ్యాత్మిక సౌరభం కూడా! వారణాసి (కాశీ) లోని పవిత్ర గంగా నది తీరాన, రాత్రి వేళల్లో వేద మంత్రోచ్ఛారణల మధ్య, వేలాది దీపాల కాంతులతో జరిగే 'గంగా హారతి' ఇచ్చే అనుభూతి వర్ణనాతీతం. ఆ సమయంలో గంగా నది నీటిపై ప్రతిబింబించే దీపాల వెలుగులు, భక్తి భావం పర్యాటకులను పరవశింపజేస్తాయి. ఇది కేవలం పర్యటన కాదు.. ఆత్మకు లభించే పరమ ప్రశాంతత."



## నైట్ టూరిజం: ఒక ప్రశాంత పయనం

"పగటిపూట ఉక్కిరిబిక్కిరి చేసే ట్రాఫిక్ జాంలు, చెమటలు చిందించే ఎండ వేడిమి, జనం రద్దీ... వీటన్నింటికీ దూరంగా, నిశ్శబ్ద నిశీధిలో సాగే ప్రయాణమే ఈ 'నైట్ టూరిజం'. పగటి వెలుగుల్లో కానరాని చారిత్రక కట్టడాల అసలు సిసలు గాంభీర్యం, విద్యుత్ దీపాల కాంతుల్లో మెరిసిపోయే ప్రకృతి అందాలు రాత్రి వేళల్లోనే సాక్షాత్కరిస్తాయి. అందుకే, ఆధునిక మానవుడి ఒత్తిడితో కూడిన జీవనశైలికి ఈ రాత్రి పర్యాటకం ఒక ఔషధంగా, మనసును తేలికపరిచే ఒక సుమధుర అనుభూతిగా మారుతోంది. చీకటిని సైతం ఒక అందమైన పర్యాటక అనుభూతిగా మార్చుకోవడం నిజంగా ఒక గొప్ప మార్పు.

### భారత్‌లో నైట్ టూరిజం ఎందుకు అంత స్పెషల్?

మన దేశంలో ఈ ట్రెండ్ ఇంతలా క్లిక్ అవ్వడానికి ముఖ్య కారణాలు: కట్టడాల సరికొత్త రూపం: తాజ్ మహల్, కుతుబ్ మినార్, చార్మినార్ లేదా జైపూర్ కోటలు... రాత్రి వేళల్లో లైటింగ్ (సౌండ్ అండ్ లైటింగ్ షోస్) తో చూస్తే వచ్చే కిక్కే వేరు.ఆహ్లాదకరమైన వాతావరణం: పగటి ఉష్ణోగ్రతలతో పోలిస్తే రాత్రిపూట ఉండే చల్లటి గాలి మానసిక ప్రశాంతతను ఇస్తుంది.ఫోటోగ్రఫీ అద్భుతాలు: నైట్ లైఫ్ ఫోటోగ్రఫీని ఇష్టపడే నేటి యువతకు ఇది ఒక సెలబ్రేషన్.



**తెలంగాణలో నైట్ టూరిజంపై సీఎం స్పెషల్ ఫోకస్**

"తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక పటంలో నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగానే హైదరాబాద్ గుండెకాయ లాంటి 'మూసీ నది పరివాహక ప్రాంతాన్ని' విదేశాల తరహాలో అద్భుతమైన నైట్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం స్పెషల్ ఫోకస్ పెట్టారు. లండన్‌లోని థేమ్స్ నది , దక్షిణ కొరియాలోని హాన్ నది తరహాలోనే.. మూసీ చుట్టూ రాత్రి వేళల్లో పర్యాటకులు సేదతీరేలా ప్రపంచస్థాయి మౌలిక వసతుల కల్పనకు అడుగులు వేస్తున్నారు."

**మూసీ నైట్ టూరిజం ప్రాజెక్ట్ - ప్రధాన ఆకర్షణలు:**

గ్లోబల్ నైట్ లైఫ్ ఎక్స్‌పీరియన్స్: మూసీ నది ఇరువైపులా రాత్రి వేళల్లో మెరిసిపోయేలా లైటింగ్, లేజర్ షోలు, వాటర్ ఫౌంటెన్లు, మరియు గ్లాస్ బ్రిడ్జీల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.

నైట్ బజార్లు, ఓపెన్ ఎయిర్ థియేటర్లు: పర్యాటకులు రాత్రి వేళల్లో షాపింగ్ చేసుకునేందుకు, రుచికరమైన హైదరాబాదీ ఫుడ్‌ను ఆస్వాదించేందుకు వీలుగా స్ట్రీట్ ఫుడ్ కోర్టులు, సాంస్కృతిక ప్రదర్శనల కోసం ఓపెన్ ఎయిర్ థియేటర్లను డిజైన్ చేస్తున్నారు.

పర్యావరణ హిత పర్యాటకం : నదిని ప్రక్షాళన చేసి, చుట్టూ పచ్చని ఉద్యానవనాలు మరియు వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయడం ద్వారా పగటిపూట కంటే రాత్రి వేళల్లో ఇవి పర్యాటకులకు సరికొత్త రీఛార్జ్ పాయింట్లుగా మారనున్నాయి.

**చీకటి తెరల వెనుక సరికొత్త వెలుగులు**

"ఒకప్పుడు సూర్యాస్తమయంతో ముగిసిపోయే పర్యాటక ప్రస్థానం.. నేడు నవతరం ఆలోచనలతో సరికొత్త రాత్రి వైభవానికి నాంది పలికింది. పగటి రద్దీ, ఎండల ఉక్కపోతలకు దూరంగా, నిశీధి నిశ్శబ్దంలో ప్రకృతిని ఆస్వాదించాలనే పర్యాటకుల తపన 'నైట్ టూరిజం' రూపంలో ఒక అద్భుతమైన జీవనశైలిగా రూపాంతరం చెందింది. ఇది కేవలం పర్యటన మాత్రమే కాదు.. యాంత్రికమైన ఆధునిక మానవుడి ఆత్మకు లభించే ఒక పరమ ప్రశాంతమైన 'హీలింగ్ ఎక్స్‌పీరియన్స్'.

అటు లడఖ్ ఆకాశంలో నక్షత్రాల తివాచీ అయినా, ఇటు గంగా తీరాన ఆధ్యాత్మిక పారవశ్యమైనా.. పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తూ దేశ పర్యాటక రంగానికి కొత్త ఊపిరి పోస్తున్నాయి. దీనికి తోడు, లండన్ థేమ్స్ నది తరహాలో హైదరాబాద్ మూసీ తీరాన్ని అంతర్జాతీయ స్థాయి నైట్ టూరిజం హబ్‌గా మార్చాలనే తెలంగాణ ప్రభుత్వ సంకల్పం.. రాబోయే రోజుల్లో ఈ రంగాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లనుంది. పర్యాటకులకు సరికొత్త అనుభూతిని, స్థానిక యువతకు ఉపాధిని, దేశ ఆర్థిక వ్యవస్థకు సరికొత్త ఇంధనాన్ని అందిస్తున్న ఈ రాత్రి పర్యాటకం.. రాబోయే రోజుల్లో భారత్‌ను గ్లోబల్ టూరిజం మ్యాప్‌లో మరింత దేదీప్యమానంగా వెలిగించడం ఖాయం.







## చిక్కుడు గుంట అభివృద్ధికి చర్యలు తీసుకోండి..

- -ఎమ్మెల్యే పాయంకు సిపిఐ, కాంగ్రెస్ నాయకుల వినతి.

**మణుగూరు, మహా** : మణుగూరు మండలం చిక్కుడు గుంట గ్రామ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసి వినతి పత్రం సమర్పించారు. గ్రామంలో మౌలిక వసతుల సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా చిక్కుడు గుంట మాజీ ఎంపీటీసీ కామిశెట్టి రామారావు మాట్లాడుతూ గ్రామంలోని అంతర్గత రహదారులు దెబ్బతిన్నాయని, సైడ్ కాలువలు, డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా గ్రామంలో తాగునీటి సౌకర్యం మెరుగుపరచాలని, నిజమైన అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. నాయకుల వినతిపై స్పందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గ్రామ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తామని, అవసరమైన పనులు దశలవారీగా చేపట్టి చేసి చూపిస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మాజీ ఎంపీటీసీ కామిశెట్టి రామారావు, మాజీ సర్పంచ్ కుర్సా రాంబాబు, మేడ వెంకటేశ్వర్లు, మేడ రామారావు, తంత్రపల్లి శోభన్, అలవాల సత్యం, రామరావు, మునిగేల లక్ష్మణ, గుమ్ముల వెంకటేశ్వర్లు తదితర సిపిఐ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వీధి కుక్కలకు షెల్టర్ గా మారిన కలెక్టరేట్

- * కుక్కల అరుపులతో బేజార్
- * శునకాల సంచారంతో ఉద్యో-గులకు భయం భయం
- * పట్టించుకునేది ఎవరు అంటూ అసహనం
- * కలెక్టరేట్లోకి కుక్కలు రాకుండా చూడాలని విజ్ఞప్తుల పర్వం



**భద్రాద్రి బ్యూరో, మహా**: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు క్రాస్ రోడ్ సమీపంలో ఉన్న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వీధి కుబక్కలకుబ షెల్టర్ గా మారడం అత్యంత బాధాకరం. కలెక్టరేట్లోని వివిధ డిపార్ట్మెంట్ల ముఖద్వారాల వద్ద కుక్కలు నిద్ర చేస్తూ విశ్రాంతి తీసుకుంటున్న పరిస్థితి నెలకొంది. కుక్కల వల్ల ప్రమాదం పొంచి ఉన్న కూడా దర్జాగా శునకాలు కలెక్టరేట్లకు వస్తున్న ఎవ్వరు పట్టించుకోని పరిస్థితి ఉంది. ఇటీవల తాజాగా చాతకుండలోని ఒక వృద్ధ మహిళపై వీధి కుక్కలు దాడి చేయగా తీవ్రంగా గాయపడి మరణించిన విషయం అందరికీ తెలిసింది. ఈ సంఘటన జరిగిన వాటి నుండి కలెక్టరేట్లో కుక్కలు కనిపించడంతో ఉద్యోగులు సందర్శకులు భయపడుతున్న పరిస్థితి ఉంది. ఇదిలా ఉండగా శునకాలు అటు ఇటు సంచరించడంతోపాటుగా అవి అరుస్తుండడం వల్ల ఉద్యోగులకు సందర్శకులకు అసౌకర్యంగా మారింది. కుక్కల వల్ల ఇబ్బంది కలుగుతున్న పట్టించుకునే నాథుడే లేడని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం కలెక్టర్ సారైనా స్పందించి కలెక్టరేట్లోకి శునకాలు రాకుండా చూడాలని సందర్శకులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## ఇసుక కోసం తవ్విన గోతిలో పడ్డ పాడి గేదెలు..

**బయటపడేందుకు అల్లాడుతున్న మూగజీవాలు**

**చర్ల మహా** : చర్ల మండలంలోని కుదునూరు గ్రామ శివారులో గోదావరి తీర ప్రాంతంలో ఇసుక తవ్వకాల కోసం తీసిన లోతైన గోతిలో రెండు పాడి గేదెలు పడిపోయిన ఘటన శుక్రవా రం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం, ఇసుక రీచ్ నిర్వాహకులు ఇసుక తవ్వకాల కోసం భారీ గోతులు తవ్వగా, వాటిలో ప్రమాదవశాత్తూ రెండు పాడి గేదెలు పడిపోయాయి. లోతైన గోతిలో పడిన గేదెలు బయటకు రాలేక తీవ్ర ఇబ్బందులు పడుతూ అల్లాడుతున్నాయి. గోతులు అత్యంత లోతుగా ఉండటంతో గేదెలను బయటకు తీసేందుకు ప్రయత్నించడానికి కూడా స్థానికులు భయపడుతున్నట్లు సమాచారం. దీంతో గ్రామస్థులు గేదెల పరిస్థితిని ఫోటోలు తీసి సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేస్తూ యజమానులకు సమాచారం అందించే ప్రయత్నం చేస్తున్నారు.గేదెల యజమానులు వెంటనే స్పందించి గేదెలను సురక్షితంగా బయటకు తీసుకువచ్చి ఇంటికి తీసుకెళ్లాలని స్థానికులు కోరుతున్నారు.ఇసుక తవ్వకాల వల్ల ఏర్పడుతున్న ప్రమాదకర గోతులు మూగజీవాలకు ముప్పుగా మారుతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## భేద భావాలు లేకుండా ఐక్యంగా ముందుకు పోవాలి

**జమాతే ఇస్లామి హింద్ సభ్యులు షేఖ్ అబ్దుల్ బాసిత్**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** విశ్వ వ్యాప్తంగా ఉన్న మానవులంతా కులం మతం వర్ణం వర్గం ప్రాంత బేధభావాలు లేకుండా మీరంతా ఒక్కటేనని హజ్ చాటి చెబుతుందని జమాతే ఇస్లామి హింద్ సభ్యులు షేఖ్ అబ్దుల్ బాసిత్ అన్నారు.పవిత్ర శుక్రవారం సందర్భంగా చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామ పంచాయతీలోని మస్జిద్ ఎ ఖుబాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవులంతా సమానమే అని చాటి చెప్పి ధనం హోదా అందలం అధికార అహంకారం వదిలి మంచి మానవతా విలువలు కలిగి సహనం ప్రేమ త్యాగ గుణాలు పెంపోదించి సమాజంలో శాంతి సామరస్యాలు వెల్లివిరిసేలా చేయాడాని ఇస్లాంలో హజ్ యాత్ర తప్పని సరి చేయడం జరిగిందని అన్నారు. హజ్ యాత్ర ముగించుకొని తిరిగి వచ్చాకా హాజీలు తమ చుట్టూ ఉన్న అసమానతలను దూరం చేస్తూ సమాజంలో మంచిని పెంచి చెడును నిర్మూలించి దైవ భీతి ఆధార సత్ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మసీదు ఇమామ్ మౌలానా మజ్హార్, సోను బాయ్, మదార్ సాహెబ్, తాజుద్దీన్, రఫీ, షబ్బీర్ హుస్సేన్, ఉమర్, షఫీ తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి అభివృద్ధికి విశేష సేవలు అందించిన బత్తుల శ్రీనివాసరావు

- కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ శాలెం రాజు
- ఉద్యోగ విరమణ పొందనున్న జీఎం (సిఎంసీ)బత్తుల శ్రీనివాస-రావుకి ఘన సన్మానం

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా**:సింగరేణికి బత్తుల శ్రీనివాసరావు అందించిన సేవలు చిరస్మరణీయమని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ శాలెం రాజు పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీన పదవీ విరమణ పొందనున్న సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం(సీఎంసీ) బత్తుల శ్రీనివాసరావుకి శుక్రవారం కార్యాలయంలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలెమ్ రాజు చేత మర్యాద పూర్వకంగా సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ షాలెమ్ రాజు మాట్లాడుతూ బత్తుల శ్రీనివాసరావు సింగరేణి సంస్థలో 33 సంవత్సరాలుగా వివిధ హోదాల్లో సమర్థవంతంగా పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి విశేష సేవలు అందించారని కొనియాడారు. తన విధి నిర్వహణలో నిబద్ధత క్రమశిక్షణ అంకితభావంతో సహచరులకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఆయనతో తమకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ సంస్థకు అందించిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని తెలిపారు. అనంతరం బత్తుల శ్రీనివాసరావు మాట్లాడుతూ పీవీకే-5 ఇంక్లైన్‌లో పనిచేసిన రోజులను స్మరించుకున్నారు. సింగరేణి వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలో సేవలందించడం తనకు గౌరవప్రదమైన అనుభవమని పేర్కొన్నారు. తన సేవా కాలంలో సహకరించిన ఉన్నతాధికారులు సహచరులు కార్మికులు ఉద్యోగులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.అనంతరం అధికారులు ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ అనంతరం ఆయన జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో కొనసాగాలని అందరూ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జీఎం కోటిరెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) బీబత్స, వీకేసీఎం (సిఎంఓఏఐ) ప్రెసిడెంట్ కొత్తగూడెం ఏరియా ప్రాజెక్టు ఆఫీసర్ నరసింహరావు, ఏజీఎం (సివిల్) రామకృష్ణ, పర్సనల్ మేనేజర్ఎల్.తిరుపతి, ఎస్ఈ (ఈ అండ్ఎం)అజ్మీర శ్రీనివాస్, ఎస్ఈ నాగభూషణం, (సిఎంఓఏఐ) జనరల్ సెక్రటరీ ఉపేందర్, ఏరియా సెక్యూరిటి అధికారి అభిలాష్, సీనియర్ పీవో ఎం. మురళీ ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## సత్యనారాయణపురంలో రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



**చర్ల మహా** : చర్ల మండలంలోని సత్యనారాయణపురంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సహకార సంఘం ద్వారా రైతులకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకం కింద పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు జీలుగా మరియు పిల్లి పెసర విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల గోపాల బుచ్చిబాబు చేతుల మీదుగా పలువురు రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విత్తనాలను కొనుగోలు చేశారు.రైతులు అందుబాటులో ఉన్న విత్తనాలు సరిపోవడం లేదని తెలిపిన నేపథ్యంలో, ఆత్మ కమిటీ చైర్మన్ సంబంధిత ఏడీఏ అధికారులతో మాట్లాడి సత్యనారాయణపురంకు అదనంగా మరో ఐదు టన్నుల జీలుగా విత్తనాలు పంపించాలని కోరారు. దీనికి స్పందించిన అధికారులు రెండు నుంచి మూడు రోజుల్లో అదనపు విత్తనాలను పంపిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏవో లావణ్య, ఏఈఓలు రామకృష్ణ, వినీల, సంఘ ఉపాధ్యక్షులు ఆళ్ల నాగరాజు, సంఘ సభ్యులు ఎన్‌వీఎస్ వర్మ, సీతాపతి రాజు, రైతులు ఉప్పులూరి జగదీష్, మందపాటి రవి, హరిచరణ్, పులిగుండల గోవిందరావు, కుదునూరు తాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.అలాగే సత్యనారాయణపురం సహకార సంఘ సీఈవో చిట్టిబాబు, క్రాంతి తదితరులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలను సమయానికి అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.




## వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ..

మణుగూరు, మహా : వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ దోసపాటి వెంకటేశ్వరరావు దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వాసవీక్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బాటసారులు, ప్రయాణికులకు ఉచితంగా మజ్జిగ అందజేశారు. తీవ్ర వేసవి దృష్ట్యా ఏర్పాటు చేసిన ఈ సేవా కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. సుమారు 500 మందికి పైగా మజ్జిగ పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ ప్రెసిడెంట్ శ్యామ్, వైస్ ప్రెసిడెంట్ కొల్లూరి గౌరీశంకర్, ట్రెజరర్ సుగ్గల సూర్యం, బండారు నర్సింహారావు, మోహన్‌రావు, వనమా లక్ష్మీనారాయణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



## పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని..

- సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా నిరసన..

**మణుగూరు, మహా** : పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్ మధుసూదన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ శుక్రవారం మణుగూరులో పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే 15 నుంచి మే 25 వరకు కేవలం పది రోజుల వ్యవధిలోనే నాలుగు విడతలుగా పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచిందన్నారు. పెట్రోల్‌పై రూ.7.38, డీజిల్‌పై రూ.7.52 పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర భారం మోపిందని విమర్శించారు. ఇంధన ధరల పెంపుతో రవాణా చార్జీలు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు కూడా భారీగా పెరుగుతున్నాయని, దీంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జెల్లా అశోక్, ఆకుల సత్యనారాయణ, పి. సంజీవరెడ్డి, వంశీకృష్ణ, సతీష్‌బాబు, జంపయ్య, సుధాకర్, పీవీ శ్రీనివాస్, చెట్టుపల్లి నాగేశ్వరరావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ అంకిత్

- లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశం

**జూలూరుపాడు, మహా**:మండల పరిధి సాయిరాం తండా సమీపంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం పరిశీలించారు. గత రాత్రి కురిసిన వర్షాల కారణంగా మొక్కజొన్న నిల్వలు తడిసాయా అనే అంశంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లతో పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టడంతో ఎటువంటి నష్టం జరగలేదని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కేంద్రంలో నిల్వ ఉంచిన మొక్కజొన్న నిల్వలను, నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో 3,600 మొక్కజొన్న బస్తాలు ఉన్నాయని, శుక్రవారమే మొత్తం లోడింగ్ ప్రక్రియ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిన్న ఎన్ని లారీలు లోడింగ్ చేశారో, ఇప్పటివరకు ఎంత పరిమాణంలో మొక్కజొన్నను గోదాములకు తరలించారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు సుమారు 28 వేల బస్తాలను గోదాములకు తరలించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రవి, ఎంపీఓ తులసీరామ్ కొనుగోలు కేంద్రం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




## కార్మిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి..

- -మణుగూరు ఏరియా స్ట్రక్చర్ సమావేశంలో ఏఐటీయూసీ

**మణుగూరు, మహా** : సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ గుర్తింపు కార్మిక సంఘంతో మణుగూరు ఏరియా మేనేజ్మెంట్ స్ట్రక్చర్ సమావేశం శుక్రవారం మణుగూరు ఏరియా జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక సింగరేణి చెక్‌పోస్ట్ వద్ద రహదారి ప్రమాదకరంగా మారిందని, వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టి కార్మికులు ప్రమాదాలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తీవ్ర వేసవి పరిస్థితుల్లో పనిచేస్తున్న కార్మికులకు విధి సమయంలో తగిన విశ్రాంతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కేసీహెచ్‌పీలో డస్ట్ కంట్రోల్ చర్యలు సమర్థవంతంగా చేపట్టడంతో పాటు సరిపడా రా వాటర్ సరఫరా చేయాలని కోరారు. పీవీ కాలనీలో కార్మికుల ఆరోగ్యాలపై ప్రభావం చూపుతున్న ఏడు ఆకుల చెట్లను తొలగించాలని, మణుగూరు ఏరియాలో ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మణుగూరు ఏరియాలో సూపర్ బజార్ ద్వారా గ్యాస్ డోర్ డెలివరీ సక్రమంగా లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే గ్యాస్ సరఫరా డోర్ డెలివరీ పద్ధతిలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఏరియాలో పనిచేస్తున్న ఓబీ కంపెనీల్లో ఎనభై శాతం ఉద్యోగాలను స్థానికులకు కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల పిల్లలు, భూములు కోల్పోయిన కుటుంబాలకు స్వయం ఉపాధి వృత్తి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, సింగరేణి ఏరియా ఆసుపత్రిలో శాశ్వత గైనకాలజిస్ట్ నియామకం చేపట్టాలని కోరారు. రిఫరల్ ఆసుపత్రుల్లో వైద్యులు సూచించిన మందులు ఏరియా ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలపై యాజమాన్యం సానుకూలంగా స్పందించిందని ఈ సందర్భంగా వై రాంగోపాల్ తెలిపారు. కేసీహెచ్‌పీ ఎంట్రన్స్ వద్ద రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, కేసీహెచ్‌పీలో త్వరలో డస్ట్ సస్పెన్షన్ సిస్టమ్ పూర్తి చేయాలని, అదనంగా మరో వాటర్ లైన్ ఏర్పాటు చేయాలని జీఎం దుర్గం రామచందర్ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్, ఏజీఎం పర్సనల్ సలగల రమేష్, ఎస్టూ జీఎం బి శ్రీనివాసచారి, ఏరియా ఉన్నతాధికారులు, ఏఐటీయూసీ జీఎం కమిటీ సభ్యులు, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మేకల ఈశ్వరరావు, ఆవుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా గ్రామీణ కార్మిక సంఘం మండల మహాసభ

- మండల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**జూలూరుపాడు, మహా**:మండల పరిధి రామచంద్రాపురం గ్రామంలో తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ఏడవ మహాసభ పేరుమాల్ల వెంకటేశ్వర్లు, పద్దం సుగుణ ల అధ్యక్షతన శుక్రవారం ఘనంగా జరిగింది. మహాసభ ప్రారంభ సూచికగా సంఘం జెండాను కోడెం బక్కులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య 1936 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం స్థాపించారని తెలిపారు. పోరాటాల పురిటిగడ్డ జూలూరుపాడులో వ్యవసాయ కార్మిక సంఘాన్ని అమరజీవి కాసాని అయిలయ్య నిర్మించారని అన్నారు. ఆనాడే కూలి సంఘం ఆధ్వర్యంలో జీతగాళ్ళ సంఘం పెట్టి దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర ఉందన్నారు. సాగు భూములు పేదలందరికీ దక్కాలని భూమి పోరాటాలు నడిపింది తెలంగాణ వ్యవసాయ గ్రామీణ, కార్మిక సంఘమన్నారు. మండలంలో జరిగిన చొప్పకట్టల పోరాటం రాష్ట్ర వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందన్నారు. అనంతరం సంగం మండల నూతన అధ్యక్షుడిగా యాసా నరేష్, కార్యదర్శిగా రాచబంటి కోటేశ్వరరావు, మహిళా కన్వీనర్ గా పద్ధం సుగుణ ల తోపాటు కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ ప్రకటించారు. కార్యక్రమంలో పెరుమాళ్ళ వెంకటేశ్వర్లు, ఇల్లంగి సీతారాములు, తోలెం సరస్వతి, గుగులోత్ నర్సింహారావు, తాటి క్రిష్ణవేణి, బానోత్ క్రిష్ణ, ఊడల వెంకటేశ్వర్లు, తాటి ఇందిర, వేముల ఉపేందర్, ఎలగల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పేదోడి వైద్యం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

- భద్రాచలం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సమస్యలు పరిష్కరించాలి
- సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గా అప్ గ్రేడ్ చేయాలి
- అడ్వాన్స్డ్ ట్రామా సెంటర్ ను భద్రాచలంలో ఏర్పాటు చేయాలి
- శానిటేషన్ కార్మికులకు క్రమం తప్పకుండా వేతనాలు ఇవ్వాలి
- ఏరియా హాస్పిటల్ సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో సర్వే



**భద్రాచలం మహా** : పేదోడి వైద్యం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి సిబ్బందిని కేటాయించాలని సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి డిమాండ్ చేశారు. సిపిఐఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం బి నర్సారెడ్డి మాట్లాడుతూ నాలుగు రాష్ట్రాల కేంద్రంగా ఉన్న భద్రాచలం ఏరియా హాస్పిటల్ లో 42 మంది వైద్యులు అవసరం కాగా కేవలం 20 మంది మాత్రమే ఉన్నారని అన్నారు. అంతేకాకుండా ఇతర వైద్య సిబ్బంది సైతం లేక రోగులు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రతిరోజు వచ్చే ఓపి పేషెంట్ల సంఖ్య సుమారు 400 వరకు ఉండగా చాలీచాలని సిబ్బందితో అంతమందికి వైద్య సేవలు అందించడం వైద్య బృందానికి కూడా సాధ్యం కావడం లేదని ఆ కారణంతోనే భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసేందుకు వైద్యులు ముందుకు రావడం లేదని నరసారెడ్డి ఆరోపించారు. జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్న భద్రాచలం శాసనసభ్యులు స్వయాన వైద్యుడు అయినప్పటికీ ఏరియా ఆసుపత్రిలో వైద్యం అందని ద్రాక్షాల మిగిలిపోతుందని నర్సారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ సిబ్బందికి ప్రతినెల వేతనాలు అందక ఆకలితో పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో సిపిఐఎం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

**సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గా అప్ గ్రేడ్ చేయలి : గడ్డం స్వామి సిపిఐ ఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి**

200 పడకల ఆసుపత్రి గా ఉన్న భద్రాచలం ఏరియా ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గా అబ్రిడ్ చేసి కావాల్సిన సిబ్బంది నియమించాలని సిపిఐఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి డిమాండ్ చేశారు. భద్రాచలం నియోజవర్గం తో పాటు ఐదు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న భద్రాచలం ఏరియాస్పత్రికి అనునిత్యం యాక్సిడెంట్ కేసులు సైతం అధికంగా వస్తున్నాయని అత్యవసర కేసులు చూసేందుకు న్యూరో సర్జన్ వంటి ప్రత్యేక వైద్య నిపుణులు లేక పేదలు ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రికి అడ్వాన్స్ ట్రమా సెంటర్ ను మంజూరు చేయాలని కోరారు. గతంలో అనేక అవార్డులు రివార్డులు అందుకున్న ఘనమైన చరిత్ర గల భద్రాచలం ఏరియా ఆసుపత్రి ఈరోజు అనేక సమస్యలతో పురిటి నొప్పులు పడుతుందని స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఆసుపత్రి కేంద్రంగా జరిగిన అనేక సంఘటనలు రాష్ట్రస్థాయిలో ఏజెన్సీలో అందుతున్న వైద్యంపై చర్చకు దారితీసిందని అన్నారు. చాలీచాలని సిబ్బందితో వైద్య సేవలు నిర్వహించడం వైద్య బృందానికి సవాల్గా మారిందని పని ఒత్తిడితో ఉన్న వైద్యులు కూడా సెలవులపై వెళ్ళిపోతున్నారని స్వామి అన్నారు. పాలకుల నిర్లక్ష్యం వల్లనే భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఈ దుస్థితి నెలకొనిందని వెంటనే పాలకులు మేలుకొని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి కావలసిన సిబ్బందిని కేటాయించడంతోపాటు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గా అప్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. శానిటేషన్ సిబ్బందికి సైతం కాంట్రాక్టర్ అనేక రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఇచ్చే అరకొర వేతనాలు కూడా రెండు మూడు నెలలకు ఒకసారి ఇస్తూ కార్మికుల ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్వామి ఆరోపించారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సమస్యలపై సిపిఐఎం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టిందని వచ్చిన సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని స్వామి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు నెంబర్ అనసూయ సిపిఐ ఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పారిల్లి సంతోష్ కుమార్ డి సీతాలక్ష్మి పట్టణ కమిటీ సభ్యులు నాదెండ్ల లీలావతి ధనకొండ రాఘవయ్య కనక శ్రీ సీనియర్ నాయకులు డి రామకృష్ణ పిల్ల ఎంకన్న ఎస్ఎఫ్ఐ నాయకులు రవీంద్ర డివైఎఫ్ఐ నాయకులు ఆది పోసి శ్రీను తదితరులు పాల్గొన్నారు



# వడదెబ్బకు వ్యక్తి మృతి

**కుటుంబంలో తీవ్ర విషాదం**

**బూర్గంపహాడ్, మహా** : బూర్గంపహాడ్ మండల పరిధిలోని మొరంపల్లి బంజర గ్రామానికి చెందిన యారం సుబ్బారెడ్డి (46) గురువారం రాత్రి వడదెబ్బతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సుబ్బారెడ్డి గురువారం సెంట్రింగ్, పనుల నిమిత్తం, జామాయిల్ తోట పరిశీలన నిమిత్తం బయటకు వెళ్లారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించి రాత్రి 8 గంటల సమయంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.మృతునికి భార్య జ్యోతి,ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుబ్బారెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ప్రస్తుతం ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, నీరు ఎక్కువగా తాగాలని, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.



# మహిళా వారోత్సవాలలో గర్భిణీలు, బాలింతలకు అవగాహన

- చిన్నారుల ఆరోగ్యం, పోషణపై ప్రతి కుటుంబం ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- జిల్లా అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా**:మహిళా వారోత్సవాల సందర్భంగా గర్భిణీలు, బాలింతలు మరియు తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం కలెక్టరేట్లో నిర్వహించారు. 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం రంగారెడ్డిజిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి మాట్లాడుతూ... గర్భిణీలు, బాలింతలు మరియు తల్లిదండ్రుల కోసం శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. తల్లిదండ్రుల సంరక్షణ పిల్లల శారీరక, మానసిక అభివృద్ధిని ప్రభావితం చేస్తుందని, లోపపోషణ వల్ల పిల్లల ఎదుగుదల దెబ్బతింటుందని వివరించారు. గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారుల ఆరోగ్యం, పోషణపై ప్రతి కుటుంబం ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. శిశువు జీవితంలోని తొలి 1000 రోజుల ప్రాముఖ్యత, తల్లిపాలు మరియు అనుబంధ ఆహారం, శిశు అభివృద్ధి మైలురాళ్లు, పోషకాహార సంరక్షణకు సంబంధించిన ముఖ్యమైన ఆరు మూల స్తంభాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యం, పోషణ, తక్షణ సంరక్షణ మరియు ప్రారంభ ప్రేరణ వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అదనంగా, తక్కువ ఖర్చుతో మరియు ఇంటి వద్ద లభించే వ్యర్థ పదార్థాలతో పిల్లల అభివృద్ధికి ఉపయోగపడే బొమ్మల తయారీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాజెక్టుల నుండి అంగన్వాడీ కార్యకర్తలు మరియు తల్లిదండ్రులు ఇంటి వద్ద లభించే వస్తువులతో తయారు చేసిన లోకాస్ట్ ఆటబొమ్మలు, విద్యా సామగ్రిని ప్రదర్శించారు. వినూత్నమైన మరియు ప్రేరణాత్మక ఆటబొమ్మలను తయారు చేసిన అంగన్వాడీ టీచర్లు, తల్లిదండ్రులను ప్రశంసిస్తూ అదనపు కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓలు, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, తల్లిదండ్రులు, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది మరియు ప్రథమ్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

- పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం
- రంగారెడ్డి జిల్లా జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి
- టెలి కాన్ఫరెన్స్ లో అధికారులతో సమీక్ష సమావేశం



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2న నిర్వహించే వేడుకలకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్ని శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొంగరకలాన్లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవన ఆవరణలో నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు అట్టహాసంగా, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రభుత్వం వివిధ వర్గాల ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర జిల్లా ప్రగతి నివేదికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమ వేదికను పూలతో అందంగా అలంకరించాలని ఉద్యానవన శాఖ అధికారికి సూచించారు. అలాగే అవసరమైన ఏర్పాట్లు, అమరవీరుల స్తూపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు, వివిధ శాఖలకు సంబంధించిన ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు తదితర కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో ఆయా శాఖలు తమ శాఖల ప్రగతి నివేదికలను జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి పంపించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమ సమయంలో విద్యుత్ అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారికి (డీఈఓ) సూచించారు. వేడుకల ఏర్పాట్లలో ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందస్తు ప్రణాళికతో పని చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ఈ టెలీ కాన్ఫరెన్స్లో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, కలెక్టరేట్ పరిపాలన అధికారి (ఏఓ) సునీల్, జిల్లా స్థాయి అధికారులు, పోలీసు శాఖ అధికారులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# పచ్చిరొట్ట జనుము విత్తనాలు సబ్సిడీపై పంపిణీ

**ఇబ్రహీంపట్నం మహా:** ఉప్పరిగూడ వ్యవసాయ సహకార సంఘం బ్యాంకు ఆధ్వర్యంలో పచ్చిరొట్ట విత్తనాలు, జనుము విత్తనాలు సబ్సిడీ పై, ఎఎంసి చైర్మన్, పిఎసిఎస్ చైర్మన్ కలిసి పంపిణీ చేయడం జరిగింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని ఉప్పరగూడ వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఏదుల పాండురంగ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, రైతులకు లాభదాయకమై పచ్చిరొట్ట విత్తనాలు, జనుము విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేయడం జరిగింది. జనుము విత్తనాల క్వింటా పూర్తి ధర: రూ. 15,550/ క్వింటా సబ్సిడీ: 50% రూ.7,775/రైతులకు లభిస్తుందని, సబ్సిడీ పోను 40 కిలోల బస్తాకు రైతులు రూ. 3110/. చెల్లించి కొనుగోలు చేయవచ్చు.

ఈ సందర్భంగా ఏఎంసి చైర్మన్ గురునాథ్ రెడ్డి మాట్లాడుతూ... రైతులు తమ పంట పొలాలలో అధికంగా రసాయన ఎరువులు వాడటం వల్ల భూసారం తగ్గి, దిగుబడులు క్షీణిస్తున్నాయి. ఫలితంగా రైతులకు పెట్టుబడి ఖర్చులు అధికమవుతున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట జనుము, జీలుగు విత్తనాల ఎరువులను సాగు చేసి, భూసారాన్ని, పంట దిగుబడులను పెంచుకోవచ్చు అని, రసాయనాలతో కూడిన ఎరువులను వాడవద్దని రైతులకు తెలిపారు.. పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ... పచ్చిరొట్ట ఎరువుల వల్ల భూమి గుల్లబారి, వర్షపు నీరు భూమిలోకి బాగా ఇంకుతుంది. నేలలో సేంద్రియ పదార్థం చేరడంతో సూక్ష్మజీవులు వృద్ధి చెంది, జీవ రసాయనిక చర్యల ద్వారా నేల సారం, ఉత్పాదకత సామర్థ్యం పెరుగుతాయి. అలాగే ఇది కలుపు మొక్కలు పెరగకుండా నివారిస్తుందని, దీంతో రైతులకు మేలు జరుగుతుందని ఆయన అన్నారు.ఏడిఏ సుజాత మాట్లాడుతూ... పచ్చిరొట్ట ఎరువుల పంట పూత దశకు రాగానే నేలలో కలియదున్నడం ద్వారా అధిక పరిమాణంలో నేలకు పోషకాలు అందుతాయి. మంచాల సొసైటీలో జీలుగా విత్తనాలు సైతం సబ్సిడీలో అందుబాటులో ఉన్నాయని, రైతులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ సుజాతా, డివిజన్ వ్యవసాయ అధికారులు, ఎంఏఓ విద్యాధరి, రవీనాథ్, వెంకటేష్, ఏఈఓ శ్రావణ్ కుమార్, సృజన. ఉప్పరిగూడ సెక్రటరీ గణేష్, రైతులు కొండ్రు సుదర్శన్, మెట్టు,అశోక్ రెడ్డి,,జడల ప్రభాకర్ రెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.

# కోహెడ భూ బాధిత రైతులకు ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- సమస్యపై ప్రశ్నిస్తున్న రైతులపై అరెస్టులకు పాల్పడవద్దు
- బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సరైన నష్టపరిహారం అందించాలి

**ఇబ్రహీంపట్నం మహా**: కోహెడ భూ బాధిత రైతులకు ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి శుక్రవారం కలెక్టర్ సి. నారాయణ రెడ్డికి, వినతిపత్రం అందజేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని, కోహెడ భూ బాధిత రైతులకు న్యాయం చేయాలని, బాధిత రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి శుక్రవారం కలెక్టర్ సి. నారాయణ రెడ్డికి, రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం కోసం ఇప్పటికే కేటాయించిన భూమిని పక్కనబెట్టి, ప్రస్తుతం సర్వే నం. 167/1లో సుమారు 264 ఎకరాల భూమిని తీసుకుంటున్న సందర్భంగా.. ఈ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్న సుమారు 160 మంది రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ఈ భూమిలో కొన్ని సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న రైతుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకొని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన విధంగా సరైన నష్టపరిహారం అందించి రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్ ను కోరినట్లు తెలిపారు. అలాగే జూన్ 3న ఫ్రూట్ మార్కెట్కు శంకుస్థాపన జరగనున్నట్లు సమాచారం అందడంతో ఆలోపు పేద రైతుల జీవన భద్రతను పరిరక్షించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, సమస్యపై ప్రశ్నిస్తున్న అమాయక రైతులపై అరెస్టులు, బెదిరింపులు, దాడుల వంటి చర్యలకు పాల్పడకుండా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# పేదల బతుకులపై బండరాళ్లు... భవిష్యత్తుపై మైనింగ్ గాయాలు

- ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్లనే పూరీ-చేస్తున్నానంటూ కనకమామిడి ప్రజల ఆర్తనాదం
- తహసీల్దార్కు వినతిపత్రం సమర్పించిన నిరుపేద ప్రజలు





**మొయినాబాద్ మహా** :మొయినాబాద్ మండలంలోని కనకమామిడి గ్రామంలో ప్రభుత్వం పేదలకు కేటాయించిన గృహ స్థలాల్లో అక్రమ మైనింగ్ జరుగుతోందంటూ గ్రామ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "నేషనల్ హైవే పనులు" పేరుతో అతి భారీగా తవ్వకాలు నిర్వహిస్తూ గ్రామాన్ని సమాధిచేస్తున్నారని గ్రామ నిరుపేదలు తహసీల్దార్కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు.

**1998లో పేదలకు గృహ స్థలాల కేటాయింపు**

గ్రామస్తుల వివరాల ప్రకారం... 1998లో అప్పటి **ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సర్వే నెం**: 51/1లో సుమారు 300 మంది పేదలకు ఒక్కొక్కరికి 110 గజాల చొప్పున గృహ స్థల పట్టాలు మంజూరు చేశారు. ఆ స్థలాలు పేద కుటుంబాలకు జీవనాధారంగా మారాయని గ్రామస్తులు తెలిపారు. శిలాఫలకం ఏర్పాటు చేసిన మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి

గ్రామ ప్రజల ప్రకారం మాజీ మంత్రి పట్నంమహేందర్ రెడ్డి ఈ లేఅవుట్ లో పేదల ఇండ్ల నిర్మాణానికి శిలాఫలకం ఏర్పాటు చేసి అధికారిక గుర్తింపు ఇచ్చారు. ప్రస్తుతం కూడా ప్లాట్ల సరిహద్దు రాళ్లు, అంతర్గత రోడ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.

**"నేషనల్ హైవే పనుల పేరుతో గ్రామానికి సమాధి**

ఇటీవల ఎలాంటి స్పష్టమైన అనుమతులు లేకుండా భారీ స్థాయిలో మైనింగ్ సాగిస్తూ గ్రామాన్నేసమాధి చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పగలు-రాత్రి తేడా లేకుండా జేసీబీలు, లారీలతో తవ్వకాలు సాగుతున్నాయని, దీనివల్ల పేదల గృహ స్థలాలు దెబ్బతింటున్నాయని వాపోయారు.

**అధికారులను కోరిన మూడు ప్రధాన డిమాండ్లు**

అక్రమ మైనింగ్ను వెంటనే నిలిపివేయాలని, అక్రమ మైనింగ్పై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్లను రక్షించాలని కోరారు.మాకు డబ్బు లేదు... కానీ న్యాయం మీద నమ్మకం ఉంది

"మాకు అధికార బలం లేకపోయినా... మా పిల్లలకు ఒక ఇల్లు ఉండాలనే ఆశ ఉంది. ఆ ఆశను కాపాడాలని అధికారులను వేడుకుంటున్నాం" అంటూ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మరీ అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి. మరీ అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

ANN తెలుగు

# మహా పత్రిక

07

శనివారం, హైదరాబాద్ | 30-05-2026 | వ్యాపార వార్తలు | BUSINESS NEWS | WWW.MAHAADAILY.COM

## టయోటా కొత్త ఈవీ లాంచ్.. 543 కిమీ రేంజ్!

టయోటా భారత మార్కెట్లో సరికొత్త అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా ఎలక్ట్రిక్ కారును విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ.23.60 లక్షలు (ఎక్స్ షోరూమ్). మారుతి ఈవిటారా ప్లాట్‌ఫారమ్ ఆధారంగా రూపొందిన ఈ కారు ఆకర్షణీయమైన డిజైన్‌తో పాటు ఆధునిక ఫీచర్లను పొందింది.ఈ కారులో 10.1 ఇంచుల ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, పనోరమిక్ సన్‌రూఫ్, వెంటిలేటెడ్ సీట్లు, వైర్‌లెస్ ఛార్జింగ్, జేబీఎల్ సౌండ్ సిస్టమ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. అలాగే 7 ఎయిర్‌బ్యాగ్స్, 360 డిగ్రీ కెమెరా, లెవెల్ 2 ADAS వంటి సేఫ్టీ ఫీచర్లు కూడా అందుబాటులో ఉన్నాయి.పనితీరు విషయానికి వస్తే.. ఇందులో 61 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్ ఉండగా, 171 హెచ్‌పీ పవర్ ఉత్పత్తి చేసే ఎలక్ట్రిక్ మోటార్‌తో ఒకసారి పూర్తి ఛార్జ్ చేస్తే 543 కిలోమీటర్ల రేంజ్ అందిస్తుంది. ఈ మోడల్ మార్కెట్లో హ్యుందాయ్ క్రెటా EV, ఎంజీ ZS EV, టాటా కర్వ్ EVలకు పోటీగా నిలవనుంది.



## స్టాక్ మార్కెట్లలో భారీ పతనం..

భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. కీలక సూచీలు భారీ నష్టాల్లో ముగియడంతో పెట్టుబడిదారుల్లో ఆందోళన నెలకొంది. బీఎస్ఈ సెన్సెక్స్ 1,092 పాయింట్లు పతనమై మానసికంగా కీలకమైన 77 వేల మార్క్ కంటే దిగువన ముగియగా.. ఎన్ఎస్ఈ నిఫ్టీ 23,550 స్థాయి కంటే దిగువకు జారింది. ఆటో, మెటల్, ఆయిల్ & గ్యాస్ రంగాల్లో భారీ అమ్మకాలు మార్కెట్ పతనాన్ని మరింత తీవ్రతరం చేశాయి.

ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, పెరుగుతున్న క్రూడ్ ఆయిల్ ధరలు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (FII) కొనసాగుతున్న అమ్మకాలు మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపాయి. ఆసియా, యూరప్ మార్కెట్లలో కనిపించిన బలహీనత దేశీయ మార్కెట్లపై కూడా ప్రతికూల ప్రభావం చూపడంతో ఇటీవల వచ్చిన లాభాల తర్వాత విస్తృత స్థాయిలో ప్రాఫిట్ బుకింగ్ జరిగింది .ఈ పతనంలో ఆటోమొబైల్, మెటల్, ఎనర్జీ రంగాలు అత్యధికంగా దెబ్బతిన్నాయి. ఈ రంగాలకు చెందిన ప్రధాన కంపెనీల షేర్లు గణనీయంగా పడిపోయాయి. ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ మందగించడం, పెరుగుతున్న ఇన్‌పుట్ ఖర్చులు, అనిశ్చిత మాక్రో ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు జాగ్రత్త ధోరణిని అవలంబించారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్ కూడా ఒత్తిడిలో ట్రేడ్ కావడంతో మార్కెట్లపై మరింత



ప్రతికూల ప్రభావం పడింది.

వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణంపై ఉన్న ఆందోళనలు ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారుల నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ సహా ప్రధాన సెంట్రల్ బ్యాంకులు భవిష్యత్తులో తీసుకునే ద్రవ్య విధాన నిర్ణయాలపై మార్కెట్ దృష్టి కేంద్రీకృతమై ఉంది. మరోవైపు పెరుగుతున్న క్రూడ్ ఆయిల్ ధరలు ద్రవ్యోల్బణ ఒత్తిడిని పెంచవచ్చనే భయాలను కూడా రేకెత్తిస్తున్నాయి.

బ్రాడర్ మార్కెట్ కూడా బలహీనంగానే కొనసాగింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ స్టాక్స్‌లో కూడా భారీ అమ్మకాలు నమోదయ్యాయి. ఎన్ఎస్ఈలో మార్కెట్ బ్రెడ్త్ ఎక్కువసేపు నెగెటివ్‌లోనే కొనసాగడం.. కేవలం కొన్ని భారీ షేర్లకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లోనూ బలహీనత ఉన్నట్లు సూచించింది.

ప్రపంచ మార్కెట్లలో అస్థిరత, ఆర్థిక వృద్ధిపై అనిశ్చితి కారణంగా పెట్టుబడిదారులు ప్రస్తుతం జాగ్రత్త ధోరణి అవలంబిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే మంచి ర్యాలీ చేసిన రంగాల్లో ప్రాఫిట్ బుకింగ్ జరగడం, అధిక విలువలపై ఉన్న ఆందోళనలు కూడా ఈ కరెక్షన్‌కు కారణమయ్యాయని పేర్కొంటున్నారు.

అయితే కొందరు మార్కెట్ విశ్లేషకులు మాత్రం ఈ కరెక్షన్‌ను దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు అవకాశంగా చూస్తున్నారు. ఇతర ప్రపంచ ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందని.. అయితే అంతర్జాతీయ మార్కెట్ ధోరణులు, జియోపాలిటికల్ పరిణామాల కారణంగా సమీప కాలంలో అస్థిరత కొనసాగే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.ట్రేడర్ల ప్రకారం.. ఇంట్రాడే ట్రేడింగ్ సమయంలో నిఫ్టీ కీలక సపోర్ట్ స్థాయిలను కోల్పోవడంతో సాంకేతిక కారణాల వల్ల కూడా అమ్మకాలు వేగం పుంజుకున్నాయి. కీలక సపోర్ట్ జోన్లు బ్రేక్ కావడంతో భారీ షేర్లలో అదనపు అమ్మకాల ఒత్తిడి పెరిగింది.ఇక రూపాయి, బాండ్ మార్కెట్ల కదలికలను కూడా పెట్టుబడిదారులు నిశితంగా గమనించారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు అభివృద్ధి చెందుతున్న మార్కెట్లపై చూపే ప్రభావాన్ని అంచనా వేయడానికి మార్కెట్ వర్గాలు ప్రయత్నిస్తున్నాయి.ఇప్పుడు పెట్టుబడిదారుల దృష్టి రానున్న ఆర్థిక గణాంకాలు, ప్రపంచ మార్కెట్ సంకేతాలు, క్రూడ్ ఆయిల్ ధరల మార్పులు, కార్పొరేట్ పరిణామాలపై నిలిచింది. రాబోయే సెషన్లలో కూడా మార్కెట్ అస్థిరత అధికంగానే ఉండవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

## ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావన్‌కోర్ లిమిటెడ్ షేర్లకు భారీ షాక్

ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావన్‌కోర్ లిమిటెడ్ (FACT) షేర్లు గురువారం భారీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. నాల్గో త్రైమాసిక ఫలితాల్లో కంపెనీ లాభాలు భారీగా పడిపోవడంతో ఇన్వెస్టర్లు నిరాశకు గురై షేర్లను విక్రయించారు. దీంతో ట్రేడింగ్ సమయంలో FACT షేర్లు దాదాపు 5 శాతం వరకు పతనమయ్యాయి.నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో FACT షేర్లు మధ్యాహ్న ట్రేడింగ్ సమయంలో రూ.878 వద్ద ట్రేడ్ అవుతూ దాదాపు 5 శాతం నష్టాన్ని నమోదు చేశాయి. కంపెనీ విడుదల చేసిన ఆర్థిక ఫలితాల ప్రకారం.. మార్చి త్రైమాసికంలో నికర లాభం కేవలం రూ.3.16 కోట్లకు పరిమితమైంది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.70.9 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. అంటే ఏడాది ప్రాతిపదికన లాభం 95.5 శాతం కుప్పకూలింది.లాభదాయకతపై తీవ్ర ప్రభావం పడటానికి ప్రధాన కారణాలు పెరిగిన ఖర్చులు, ఇతర ఆదాయం తగ్గిపోవడమేనని కంపెనీ పేర్కొంది. అయితే దిగువ స్థాయి ఫలితాలు బలహీనంగా ఉన్నప్పటికీ ఆదాయ పరంగా FACT మంచి వృద్ధిని నమోదు చేసింది.కంపెనీ ఆపరేషన్ల ద్వారా వచ్చిన ఆదాయం 40.9 శాతం పెరిగి రూ.1,484 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.1,053 కోట్లుగా ఉంది. అయితే గత త్రైమాసికంతో పోలిస్తే రెవెన్యూ సుమారు 5.4 శాతం తగ్గింది.పూర్తి ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గణాంకాలు కూడా నిరాశాజనకంగానే ఉన్నాయి. FY26లో FACT రూ.39.6 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.41.2 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. అయితే వార్షిక ఆపరేషనల్ రెవెన్యూ మాత్రం 41 శాతం కంటే ఎక్కువ పెరిగి రూ.5,724 కోట్లకు చేరుకుంది.గత కొన్ని సంవత్సరాలుగా FACT షేర్లు భారీ ర్యాలీ నమోదు చేయడంతో పెట్టుబడిదారుల



అంచనాలు ఎక్కువగా ఉన్నాయని.. కానీ మార్జిన్లు తగ్గడం, లాభదాయకత బలహీనపడటం మార్కెట్‌ను నిరాశకు గురిచేసిందని విశ్లేషకులు చెబుతున్నారు. పెరుగుతున్న ఆపరేషనల్ ఖర్చులు, ముడిసరుకు ధరల అస్థిరత ఎరువుల కంపెనీలకు ప్రధాన సవాళ్లుగా మారాయని అభిప్రాయపడుతున్నారు.ఇక ఎరువుల రంగం మొత్తం కూడా ప్రస్తుతం కొన్ని సవాళ్లను ఎదుర్కొంటోంది. వర్షాకాల అంచనాలు, సబ్సిడీ సంబంధిత అంశాలు, అంతర్జాతీయ కమోడిటీ ధరల అస్థిరత ఈ రంగంపై ప్రభావం చూపుతున్నాయి. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలపై వచ్చిన నివేదికలు కూడా ఇన్వెస్టర్లలో ఆందోళన పెంచాయి.

గత ప్రదర్శన కారణంగా రిటైల్ ఇన్వెస్టర్లలో FACT ఒక కీలక స్టాక్‌గా మారినప్పటికీ.. తాజా త్రైమాసిక ఫలితాలు కంపెనీ భవిష్యత్ లాభదాయకత, ఆపరేషనల్ సామర్థ్యంపై కొత్త సందేహాలను రేకెత్తించాయి. ఇప్పుడు కంపెనీ భవిష్యత్ మార్గదర్శకాలు, సబ్సిడీ పరిణామాలు, రంగ ధోరణులపై మార్కెట్ దృష్టి నిలవనుంది.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



## స్వచ్ఛందంగా లైంగిక వృత్తిని ఎంచుకుంటే కేసులు వద్దు

- **సెక్స్ వర్కర్లపై దాడులు చేయడం చట్టవిరుద్ధమన్న సుప్రీంకోర్టు.**
- **వారి గుర్తింపును బహిర్గతం చేయొద్దని మీడియాకు తీవ్ర హెచ్చరిక.**
- **నివాస ధ్రువీకరణ లేకపోయినా ఆధార్ కార్డులు జారీ చేయాలని ఆదేశం.**

**ఢిల్లీ, మహా :** సెక్స్ వర్కర్ల హక్కులు, వారి పట్ల వ్యవహరించాల్సిన తీరుపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. స్వచ్ఛందంగా లైంగిక వృత్తిని ఎంచుకున్న వారిపై దాడులు చేయడం, కేసులు నమోదు చేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. ఈ వృత్తిలోకి తమ సొంత ఇష్టంతో వచ్చిన వారికి, అలాగే మానవ అక్రమ రవాణా ద్వారా బలవంతంగా ఈ కూపంలోకి నెట్టబడిన బాధితులకు మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉందని ధర్మాసనం ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. పోలీసులతో పాటు ప్రభుత్వ యంత్రాంగం ఈ రెండు వర్గాల మధ్య ఉన్న ప్రధానమైన తేడాను గుర్తించి వ్యవహరించాలని సూచిస్తూ పలు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. మేజర్లుగా ఉండి, స్వచ్ఛందంగా ఈ వృత్తిలోకి వచ్చిన సెక్స్ వర్కర్లపై పోలీసులు దాడులు చేయడం, వారిపై అనవసరంగా కేసులు బనాయించడం ఎంతమాత్రం తగదని కోర్టు తేల్చిచెప్పింది. కేవలం వ్యభిచార వృత్తిలో ఉన్నారనే కారణంతో వారిని వేధించడం సరికాదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం.. దేశంలోని ప్రతి పౌరుడికి గౌరవప్రదంగా జీవించే హక్కు ఉంటుందని, ఆ ప్రాథమిక హక్కు సెక్స్ వర్కర్లకు కూడా పూర్తిస్థాయిలో వర్తిస్తుందని సుప్రీం కోర్టు గుర్తు చేసింది. పోలీసు శాఖ తమ దృష్టిని సెక్స్ వర్కర్లపై కాకుండా.. అమాయకులను బలవంతంగా ఈ వృత్తిలోకి దించుతూ మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యవస్థీకృత నేర ముఠాలపై కేంద్రీకరించాలని సూచించింది.ఇదే సమయంలో మీడియా వ్యవహారశైలిపైనా న్యాయస్థానం కఠిన నిబంధనలు విధించింది. దాడులు జరిగే సమయంలో లేదా ఇతర సందర్భాల్లో సెక్స్ వర్కర్ల ఫొటోలు, వీడియోలను ప్రసారం చేయడం లేదా ప్రచురించడం ద్వారా వారి గుర్తింపును బహిర్గతం చేయడం ముమ్మాటికీ నేరమేనని మీడియా సంస్థలకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది. దేశంలోని ఇతర పౌరుల మాదిరిగానే వారికి కూడా చట్టపరమైన, సామాజికపరమైన రక్షణ కల్పించాలని ఆదేశించింది. అలాగే, సెక్స్ వర్కర్లకు నివాస ధ్రువీకరణ పత్రాలు లేకపోయినా సరే, వారందరికీ ఎలాంటి ఆటంకాలు లేకుండా ఆధార్ కార్డులు జారీ చేయాలని యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ)ను కోర్టు ఆదేశించింది. కేవలం సరైన గుర్తింపు పత్రాలు లేవన్న సాకుతో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు వారిని దూరం చేయడం అన్యాయమని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది.



## ఆమె దేశానికి గర్వకారణం

- **వినేశ్ ఫొగాట్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట**
- **ఆసియా క్రీడల ఎంపిక ట్రయల్స్‌కు గ్రీన్ సిగ్నల్.**
- **క్రీడా వ్యవహారాల్లో హైకోర్టుల జోక్యంపై సర్వోన్నత న్యాయస్థానం అసహనం.**



**ఢిల్లీ, మహా :** భారత స్టార్ రెజ్లర్, మూడుసార్లు ఒలింపియన్‌గా దేశానికి ప్రాతినిధ్యం వహించిన వినేశ్ ఫొగాట్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. 2026 ఆసియా క్రీడల కోసం ఈ నెల 30, 31 తేదీల్లో జరగనున్న ఎంపిక ట్రయల్స్‌లో పాల్గొనేందుకు సర్వోన్నత న్యాయస్థానం ఆమెకు పచ్చజెండా ఊపింది. వినేశ్‌కు అవకాశం కల్పిస్తూ గత వారం ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మాతృత్వం అనేది క్రీడాకారుల వృత్తిపరమైన అవకాశాలను అడ్డుకునే వైకల్యం కాదని హైకోర్టు గతంలో స్పష్టం చేయగా, నిబంధనల ప్రకారం ఆమెకు అర్హత లేదని డబ్ల్యూఎఫ్ఐ సుప్రీంను ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వినేశ్ ఫొగాట్ దేశానికి గర్వకారణంగా నిలిచిన క్రీడాకారిణి అని న్యాయస్థానం కొనియాడింది. ఆమె స్థానంలో వేరెవరైనా ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేదని, హైకోర్టు తీర్పుతో ఆమెలో ఆశలు, అంచనాలు చిగురించాయని ధర్మాసనం అభిప్రాయపడింది. సరిగ్గా ట్రయల్స్ ముంగిట, ఈ దశలో మేం ఏమీ చేయలేమని చెప్పి ఆమెను వెనక్కి పంపడం ఏమాత్రం సరికాదని డబ్ల్యూఎఫ్ఐ తరఫు న్యాయవాదికి కోర్టు స్పష్టం చేసింది. అయితే, వినేశ్‌కు ట్రయల్స్‌లో పాల్గొనేందుకు తాత్కాలిక అనుమతి ఇస్తూనే.. క్రీడా వ్యవహారాల్లో హైకోర్టులు తరచుగా, అత్యంత వేగంగా జోక్యం చేసుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేయడం గమనార్హం.

ఇవి మెడికల్ కాలేజీ అడ్మిషన్లు కావని, జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు సంబంధించిన సున్నితమైన వ్యవహారాలని జస్టిస్ నరసింహ వ్యాఖ్యానించారు. ఈ తరహాలో కోర్టులు పదేపదే జోక్యం చేసుకొని మొత్తం క్రీడా షెడ్యూళ్లను దెబ్బతీయకూడదని హితవు పలికారు. ప్రస్తుతానికి వినేశ్‌ను ఆసియా క్రీడల ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అనుమతించిన ధర్మాసనం, డబ్ల్యూఎఫ్ఐ దాఖలు చేసిన పిటిషన్‌పై పూర్తిస్థాయి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ వ్యవహారంపై తమకు తగిన సమాధానం ఇవ్వాల్సిందిగా వినేశ్ ఫొగాట్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది.

## యువతను ఇలా నిరాశపరచకూడదు

- **నీట్ లీక్ వ్యవహారంపై సుప్రీంకోర్టు తీవ్ర విచారం.**
- **పారదర్శకతకు కట్టుబడి ఉన్నామంటూ ఎన్టీఏ అఫిడవిట్ దాఖలు.**

**ఢిల్లీ, మహా:** ఎన్నో ఆశలు, ఆశయాలతో 'నీట్' పరీక్ష రాసిన దేశ యువతను ఇలా నిరాశపరచడం ఏమాత్రం తగదని భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పేపర్ లీకేజీల కారణంగా విద్యార్థులు తీవ్రమైన మానసిక క్షోభను అనుభవిస్తున్నారని కోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. గతంలో జరిగిన లీకేజీ ఘటనల నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదంటూ గత వారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం, తాజాగా ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ ఏడాది మే 3వ తేదీన దేశవ్యాప్తంగా జరిగిన నీట్ యూజీ 2026 పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ మేరకు స్పందించింది.మరోవైపు, ఈ వ్యవహారంలో ఎన్టీఏ సుప్రీంకోర్టులో సమగ్రమైన అఫిడవిట్ దాఖలు చేసింది. తన పర్యవేక్షణలో జరిగే అన్ని పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు తాము పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేసింది. భవిష్యత్తులో పేపర్ లీకేజీలు, మాల్ ప్రాక్టీస్ వంటి అక్రమాలకు తావులేకుండా పటిష్ట చర్యలు చేపట్టేందుకు కేంద్ర విద్యాశాఖతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నట్లు తెలిపింది. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంపొందించే దిశగా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మాజీ ఇస్రో ఛైర్మన్ కె. రాధాకృష్ణన్ కమిటీ చేసిన సిఫార్సులలో మెజారిటీ అంశాలను ఇప్పటికే అమలు చేసినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లింది.

పరీక్షా విధానంలో తాము తీసుకొచ్చిన పలు సంస్కరణలు, భద్రతాపరమైన మార్పులను సైతం ఎన్టీఏ తన అఫిడవిట్‌లో కోర్టుకు సవివరంగా నివేదించింది. సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే క్రమంలో కొత్తగా 16 సీనియర్ పోస్టులను ఏర్పాటు చేశామని వెల్లడించింది. టెక్నాలజీ ఆపరేషన్స్, టెస్ట్ సెక్యూరిటీ పర్యవేక్షణ బాధ్యతల కోసం ఇద్దరు జాయింట్ సెక్రటరీ స్థాయి అధికారులను అడిషనల్ డైరెక్టర్స్ జనరల్‌గా నియమించినట్లు పేర్కొంది. అలాగే, ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీటీవీ కెమెరాలను విధిగా ఏర్పాటు చేయడంతో పాటు, పరీక్ష పూర్తయిన తర్వాత ఆ ఫుటేజీని కనీసం 90 రోజుల పాటు భద్రపరచాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వివరించింది.ఇకపై నీట్ పరీక్షలను సాంకేతికత ఆధారంగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) మోడ్‌లో నిర్వహించాలా, లేక యథావిధిగా పెన్ అండ్ పేపర్ పద్ధతిలోనే కొనసాగించాలా అనే కీలక అంశంపై త్వరలోనే స్పష్టత రానున్నట్లు ఎన్టీఏ తెలిపింది. దీనిపై అత్యున్నతస్థాయి కమిటీ సంబంధిత మంత్రిత్వ శాఖలతో విస్తృత సంప్రదింపులు జరుపుతోందని, త్వరలోనే ఓ తుది నిర్ణయం తీసుకోనుందని వెల్లడించింది. అంతేకాకుండా, ఎగ్జామినేషన్ మేనేజ్‌మెంట్‌లో మరింత నైపుణ్యాన్ని జోడించేందుకు ఐఐటీ, యూజీసీ, సీబీఎస్ఈ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల నిపుణులను కూడా భాగస్వాములను చేసినట్లు సుప్రీంకోర్టుకు సమర్పించిన నివేదికలో ఎన్టీఏ స్పష్టం చేసింది.


## సంక్షేమ పథకాలకు డిజిటల్ కరెన్సీ

- **వినియోగాన్ని విస్తృతం చేసే దిశగా ఆర్బీఐ సన్నాహాలు.**
- **వార్షిక నివేదికలో కీలక అంశాల వెల్లడి.. పైలట్ ప్రాజెక్టుల విస్తరణకు నిర్ణయం.**

**ముంబై, మహా :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) వినియోగాన్ని మరింత విస్తృతం చేసే దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఇప్పటివరకు పరిమిత స్థాయిలోనే ఉన్న ఈరూపాయ్ వాడకాన్ని ఇకపై ప్రభుత్వ సంక్షేమ పథకాల పంపిణీకి, అలాగే రిటైల్ రంగానికి కూడా పూర్తిస్థాయిలో విస్తరించాలని యోచిస్తోంది. ఈ మేరకు ఆర్బీఐ తన తాజా వార్షిక నివేదికలో డిజిటల్ కరెన్సీ విస్తరణ ప్రణాళికలను స్పష్టంగా పొందుపరిచింది. రాబోయే రోజుల్లో సామాన్యుడికి ఈ సేవలను మరింత చేరువ చేసేందుకు వీలుగా, ప్రస్తుతం నడుస్తున్న డిజిటల్ కరెన్సీ పైలట్ ప్రాజెక్టును మరింత విస్తరించాలని నిర్ణయించింది.

క్షేత్రస్థాయిలో డిజిటల్ కరెన్సీ పనితీరును, ప్రభుత్వ పథకాల బదిలీలో దాని ఆవశ్యకతను అంచనా వేసేందుకు ఇప్పటికే పలు ప్రయోగాలు చేపట్టినట్లు కేంద్ర బ్యాంక్ వెల్లడించింది. ఇందులో భాగంగా 202526 ఆర్థిక సంవత్సరంలో గుజరాత్, పుదుచ్చేరి, చండీగఢ్ ప్రాంతాల్లో నగదు బదిలీ పథకాల కింద డిజిటల్ కరెన్సీని ప్రయోగాత్మకంగా పరిశీలించినట్లు ఆర్బీఐ తన నివేదికలో వివరించింది. ముఖ్యంగా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ లబ్ధిదారులకు అందించే ఆహార సబ్సిడీని సైతం సీబీడీసీ ద్వారానే విజయవంతంగా అందించినట్లు స్పష్టం చేసింది.

అయితే, ఈ విధానంలో పారదర్శకతను పెంచేందుకు ఆర్బీఐ పకడ్బందీ చర్యలు చేపట్టింది. లబ్ధిదారులకు అందిన డిజిటల్ నిధులను దుర్వినియోగం కాకుండా, కేవలం రేషన్ షాపులు, ఎంపిక చేసిన నిర్దిష్ట వ్యాపారుల వద్ద వస్తువుల కొనుగోలుకు మాత్రమే ఉపయోగించేలా సాంకేతిక నియంత్రణలు విధించింది. ఈ పైలట్ ప్రాజెక్టులు ఆశించిన ఫలితాలను ఇస్తుండటంతో, దీన్ని మరింత విస్తృత స్థాయికి తీసుకెళ్లాలని ఆర్బీఐ భావిస్తోంది. ఇకముందు చేపట్టే సీబీడీసీ పైలట్ ప్రాజెక్టుల్లో మరింత మంది ప్రజలను, వ్యాపారులను భాగస్వాములుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రిజర్వ్ బ్యాంక్ తన వార్షిక నివేదికలో పేర్కొంది. ఈ అడుగులతో రాబోయే రోజుల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల పంపిణీలో కీలక మార్పులు రానున్నట్లు స్పష్టమవుతోంది.



# కమల్‌తో భాగ్యశ్రీ స్పెషల్ మూమెంట్

**అఖిల్‌తో నటించిన 'లెనిన్' విడుదలకు సిద్ధం**



ముంబై/చెన్నై: చాలా తక్కువ సమయంలోనే తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే ఇప్పుడు మరో కీలక అడుగు వేసేందుకు సిద్ధమైంది. ఉత్తరాది భామ అయినప్పటికీ తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ యువ నటి ఇప్పుడు తమిళ ఇండస్ట్రీలో అడుగుపెడుతూ తన కెరీర్‌ను మరింత విస్తరించుకుంటోంది. ఇప్పటికే తెలుగు చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న భాగ్యశ్రీ.. ఇప్పుడు కోలీవుడ్‌లో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమైంది.

రవితేజ హీరోగా తెరకెక్కిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన భాగ్యశ్రీ.. తొలి చిత్రంతోనే గ్లామర్, నటనతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత వరుస అవకాశాలు అందుకుంటూ ప్రముఖ హీరోలు, పెద్ద నిర్మాణ సంస్థలతో పనిచేసే స్థాయికి చేరుకుంది. ఇటీవల రామ్ హీరోగా రూపొందిన 'ఆంధ్రా కింగ్ తాలుకా' చిత్రంలో కనిపించిన ఆమె.. ఇప్పుడు తమిళంలో భారీ ప్రాజెక్ట్‌తో ఎంట్రీ ఇస్తోంది.

శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కుతున్న 'సెయాన్' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న భాగ్యశ్రీ.. ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకుంది. ప్రముఖ నటుడు కమల్ హాసన్ తన రాజ్‌కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'తాయ్ కిళవి' ఫేమ్ శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహిస్తున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది.

ఇటీవల ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొన్న భాగ్యశ్రీ.. కమల్ హాసన్‌ను వ్యక్తిగతంగా కలుసుకుని ఆయన ఆశీస్సులు తీసుకుంది. అనంతరం కమల్‌తో దిగిన ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ భావోద్వేగ పోస్ట్ చేసింది. చిన్నప్పటి నుంచి కమల్ హాసన్ ఎదుగుదలను చూస్తూ పెరిగానని, తన మనసులో ఎంతో గౌరవం ఉన్న వ్యక్తి ఇప్పుడు తన భుజంపై చేయి వేసి ఆశీర్వదించడం జీవితాంతం గుర్తుండిపోయే క్షణమని పేర్కొంది.

"ఎంతో అభిమానించే కమల్ సర్‌తో కలిసి పని చేసే అవకాశం రావడం నా అదృష్టం. రాజ్‌కమల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలో నటించడం నాకు గౌరవంగా భావిస్తున్నాను. మీరు గర్వపడేలా కష్టపడి పనిచేస్తాను" అంటూ భాగ్యశ్రీ తన పోస్టులో రాసుకొచ్చింది. ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అభిమానులు, సినీ ప్రముఖులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

ఇక తమిళంతో పాటు తెలుగులో కూడా భాగ్యశ్రీ వరుస సినిమాలతో బిజీగా ఉంది. అఖిల్ అక్కినేనితో కలిసి నటించిన 'లెనిన్' సినిమా ప్రస్తుతం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం వచ్చే నెల 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి.


గ్లామర్, నటన, వరుస అవకాశాలతో కెరీర్‌లో వేగంగా ఎదుగుతున్న భాగ్యశ్రీ బోర్సే.. ఇప్పుడు తెలుగు నుంచి తమిళానికి అడుగుపెడుతూ తన ప్రయాణాన్ని మరింత విస్తరిస్తోంది. కోలీవుడ్ ఎంట్రీతో ఆమె కెరీర్ మరో స్థాయికి చేరుతుందా అనే ఆసక్తి సినీ వర్గాల్లో నెలకొంది.





# కొడుకు తొలి సినిమాకు టెన్షన్?

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సీఎం విజయ్ రాజకీయాలతో పాటు వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అంశాలు కూడా తరచూ చర్చనీయాంశమవుతున్నాయి. ముఖ్యంగా ఆయన కుటుంబ జీవితం, విడాకులపై వస్తున్న వార్తల మధ్య ఇప్పుడు ఆయన కుమారుడు జేసన్ సంజయ్ సినీ ఎంట్రీ మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. తండ్రిలా హీరోగా వస్తాడని భావించిన జేసన్ సంజయ్.. ఊహించని విధంగా దర్శకుడిగా మారి అందరినీ ఆశ్చర్యపరిచాడు. 'సిగ్మా' పేరుతో తెరకెక్కిస్తున్న తన తొలి చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో సందీప్ కిషన్ హీరోగా నటిస్తుండగా, ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా కనిపించనుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూలై 31న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని నిర్మాతలు ప్రకటించారు. దీంతో విజయ్ అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. దర్శకుడిగా జేసన్ తొలి ప్రయత్నం ఎలా ఉంటుందన్న చర్చ సోషల్ మీడియాలో జరుగుతోంది.ఇక మరోవైపు విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగణ్' విడుదల తేదీపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే ఈ సినిమా కూడా త్వరలో విడుదల కావచ్చన్న ప్రచారం జరుగుతోంది. ఒకవేళ అదే నిజమైతే తండ్రీకొడుకుల సినిమాలు నెల వ్యవధిలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.ఇటీవల విజయ్ భార్య సంగీత తన కుమారుడు, కుమార్తెతో కలిసి లండన్ వెళ్లిపోయినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో జేసన్ సంజయ్ కెరీర్‌పై కూడా ఆసక్తి పెరిగింది. తండ్రి నుంచి దూరంగా ఉంటున్న జేసన్ తెరకెక్కించిన తొలి చిత్రానికి విజయ్




# కరణ్ జోహార్ ఇన్‌స్టా అన్‌ఫాలో గుట్టు విప్పాడు

బాలీవుడ్ దర్శక నిర్మాత కరణ్ జోహార్ ఇన్‌స్టాగ్రామ్‌లో షారుఖ్ ఖాన్, ఆలియా భట్, రణవీర్ సింగ్ వంటి పలువురు టాప్ సెలబ్రిటీలను అన్‌ఫాలో చేయడంతో సోషల్ మీడియాలో పెద్ద చర్చ మొదలైంది. దీంతో ఇండస్ట్రీలో విభేదాలు వచ్చాయా? అనే ఊహాగానాలు కూడా వినిపించాయి.ఈ నేపథ్యంలో కరణ్ స్వయంగా స్పందిస్తూ.. ఇది కేవలం 'డిజిటల్ డిటాక్స్' మాత్రమేనని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో అనవసరంగా గడిపే సమయాన్ని తగ్గించుకోవడానికే ఇలా చేశానని చెప్పారు. దీనిని పెద్ద వార్తగా మార్చొద్దని, క్లిక్‌బైట్ కథనాలు ఆపాలని కూడా కోరారు.ప్రస్తుతం కరణ్ ఇన్‌స్టాగ్రామ్ ఫాలోయింగ్ సంఖ్య 74కు పడిపోయింది. అయితే ఇది ఎలాంటి వ్యక్తిగత విభేదాలు లేదా ఇండస్ట్రీ డ్రామాలకు సంబంధించినది కాదని..




కేవలం మానసిక ప్రశాంతత కోసం తీసుకున్న నిర్ణయమేనని కరణ్ క్లారిటీ ఇచ్చారు.

## తృప్తి డిమ్రి.. గ్లామర్‌తో పాటు

# గ్రోత్‌కు చిరునామా

ముంబై: బాలీవుడ్‌లో ప్రస్తుతం అత్యంత వేగంగా ఎదుగుతున్న నటీమణుల్లో తృప్తి డిమ్రి పేరు ముందువరుసలో వినిపిస్తోంది. అందం, అభినయం, గ్లామర్‌తో పాటు వరుస విజయాలతో బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న తృప్తి డిమ్రి తాజాగా మరోసారి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పింక్ బ్లేజర్, వైట్ ట్యాంక్ టాప్, హై వెయిస్ట్ డెనిమ్ జీన్స్‌లో సముద్రతీర నేపథ్యంతో దిగిన ఫోటోల్లో ఆమె స్టైలిష్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. గాలికి ఎగిరే జుట్టు, కాన్ఫిడెంట్ ఎక్స్‌ప్రెషన్స్, మోడ్రన్ ఫ్యాషన్‌తో తృప్తి మరోసారి ఫ్యాషన్ ఐకాన్‌గా నిలిచింది.1994 ఫిబ్రవరి 23న న్యూఢిల్లీలో జన్మించిన తృప్తి డిమ్రి సినీ ప్రయాణం నెమ్మదిగా మొదలై ప్రస్తుతం స్టార్‌డమ్ దాకా చేరింది. 2017లో విడుదలైన 'పోస్టర్ బాయ్స్' చిత్రంలో చిన్న పాత్రతో సినీ రంగంలోకి అడుగుపెట్టిన ఆమె.. 2018లో వచ్చిన 'లైలా మజ్ను' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమైంది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద పెద్ద విజయం సాధించకపోయినా, తృప్తి నటనకు మంచి గుర్తింపు లభించింది. 2020లో విడుదలైన నెట్‌ఫ్లిక్స్ చిత్రం 'బుల్బుల్' ఆమె కెరీర్‌ను పూర్తిగా మార్చేసింది. ఆ చిత్రంలో చూపించిన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న తృప్తి.. తర్వాత 'కాలా' (2022)లో మరోసారి తన నటనతో ఆకట్టుకుంది. కానీ 2023లో విడుదలైన 'యానిమల్' చిత్రం ఆమెకు దేశవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ తీసుకొచ్చింది. రణబీర్ కపూర్ సరసన జోయా పాత్రలో కనిపించిన తృప్తి ఒక్కసారిగా సోషల్ మీడియా సెన్సేషన్‌గా మారిపోయింది.

'యానిమల్' తర్వాత తృప్తి కెరీర్ పూర్తిగా మారిపోయింది. బాలీవుడ్‌లో అత్యంత డిమాండ్ ఉన్న హీరోయిన్లలో ఒకరిగా మారిన ఆమెకు వరుసగా భారీ ప్రాజెక్టులు వస్తున్నాయి. ఇటీవల 'బ్యాడ్ న్యూజ్', 'విక్కీ విద్యా కా వో వాలా వీడియో', 'భూల్ భూలయ్యా 3' వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించింది.ప్రస్తుతం ఆమె చేతిలో భారీ ప్రాజెక్టుల జాబితా ఉంది. 'ధడక్ 2' చిత్రంలో నటిస్తుండగా.. షాహిద్ కపూర్‌తో కలిసి 'ఓ రోమియో'లో కనిపించనుంది. అలాగే మాధురి దీక్షిత్‌తో కలిసి నెట్‌ఫ్లిక్స్ ప్రాజెక్ట్ 'మా బెహెన్'లో నటిస్తోంది. వీటితో పాటు ప్రభాస్ సరసన రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'స్పిరిట్'లో హీరోయిన్‌గా ఎంపిక కావడం ఆమె కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా భావిస్తున్నారు.గ్లామర్, నటన, ఫ్యాషన్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో యువతలో ప్రత్యేక క్రేజ్ సంపాదించిన తృప్తి డిమ్రి.. ప్రస్తుతం బాలీవుడ్‌లో అత్యంత వేగంగా ఎదుగుతున్న స్టార్ హీరోయిన్‌గా తన స్థానాన్ని మరింత బలపరుచుకుంటోంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com